


Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 కీర్తిశేషులు: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమీక్షణ

సంపుటి: 80 • సంచిక: 48 • 13-11-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



సునామీ చుట్టిన సోనియా! కలకలం రేపిన ప్రసన్న!

- తమకు రాజకీయ పునికి లేకుండా చేస్తున్నారని జగన్ అనుమానం.
- పులివెందుల నుంచి పోటీ ఖాయం.
- ప్రజల నుంచే పార్టీపై ఒత్తిడికి వ్యూహం.
- సిఎల్పీ సమావేశంలో అమీతుమీ.

ఎంతో ఆశతో తల్లి, చెల్లితో సహా ఢిల్లీ వెళ్లిన వైఎస్ జగన్ పుట్టెడు నిరాశతో తిరిగి వచ్చాడు. రాజకీయాలలో ఎప్పుడు ఎవరికి ఏ పరిస్థితి దాపురిస్తుందో వూహకు అందని విషయం. సరిగ్గా ఆరు నెలల క్రితం 294 టిక్కెట్లు తమ చిత్తం వచ్చినట్లుగా పంచిన కుటుంబం వారిది. చీపురు పుల్ల వంటి వారిని, రాజకీయంగా ఓనమాలు తెలియని వారిని కూడా, తమకు మనసు పడితే ఎమ్మెల్యేలుగా, ఎమ్పీలుగా, మంత్రులుగా చేశారు. రాజకీయ అందలాలు ఎక్కించారు. తమకు గిట్టని వారిని శంకరగిరి మాన్యాలు పట్టించారు. కానీ ఇప్పుడు అదే కుటుంబానికి చెందిన వారసుడు, తన తండ్రి ఖాళీ చేసిన స్వంత నియోజకవర్గం టిక్కెట్ కోసం సకుటుంబంగా ప్రాధేయపడవలసి వస్తున్నది. అంతకు తగ్గినా సౌమ్యంగానే సున్నా చుట్టి వెనక్కు పంపింది సోనియాగాంధీ. ఎమ్పీగా వున్నవారిని ఎమ్మెల్యేగా నిలబెట్టి ఉప ఎన్నికలు తెచ్చి పెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదని, అందువల్ల నువ్వు ఆ ఆలోచన మానుకొని, మీ ఇంట్లో మరెవరి పేరైనా చెప్తే టిక్కెట్ ఇస్తానని చెప్పారట సోనియాగాంధీ.

కానీ పులివెందులలో పోటీ నుంచి వెనక్కు తగ్గడానికి వైఎస్ జగన్ ఎంత మాత్రం సిద్ధంగా లేడు. పులివెందులలో పోటీ అంటే, పాండవులు సంధి కోసం ఐదు వూళ్లు ఇస్తే చాలు అన్న రాజకీయ చాణక్యం అన్నమాట. రాష్ట్ర రాజకీయాలలో వుండాలంటే శాసనసభ సభ్యత్వం తప్పనిసరి. అది చేతిలో వుంటే ఏదో ఒక సందర్భంలో ముఖ్యమంత్రి పదవి అవకాశం అందివస్తుంది. తనకు ఎమ్పీగా కొనసాగడం ఇష్టం లేదని, రాష్ట్ర రాజకీయాల మీదనే మక్కువ అని సోనియాగాంధీకి విన్నవించాడట. కానీ ఆమె పట్టించుకోలేదు.

రాష్ట్ర రాజకీయాలలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చి, ఆయన చెప్పినట్లు నడుచుకొని పెద్ద తప్పు చేశామన్న భావన కాంగ్రెస్ అగ్ర నాయకత్వానికి వుంది. దానివల్లనే జగన్ ఇంత దూరం మొండిగా వేధిస్తున్నాడన్నది వారి అభిప్రాయం.

కొరవ 14వ పేజీలో

తమ కుటుంబానికి ఆగర్భశత్రువైన నేదురుమల్లి జనార్దనరెడ్డిని కలిసి, ఆశీస్సులు కోరడం ద్వారా నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాడు. తెలుగుదేశం నుంచి కోవూరు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రసన్న, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చివరిదశలో అమలు చేసిన ఆకర్ష పథకంలో తొలిబోణీగా కాంగ్రెస్‌కు చేరువ అయ్యాడు. వీరిద్దరి మధ్య పెద్ద మొత్తంలో బేరం కుదిరిందని అప్పట్లో గగ్గోలు లేచింది. ప్రసన్న అలియాస్ టెన్‌క్రోర్ అని తెలుగుదేశం నేతలు గేలి చేశారు. అయితే వైఎస్ హఠాత్ మరణంతో ఆయన రాజకీయం కూడా తలక్రిందులై పోయింది. తెలుగుదేశం పార్టీ ఆయన్ను మళ్లీ దగ్గరకు చేర్చుకొనే పరిస్థితి లేదు. ఆయన శాసన సభ్యత్వాన్ని రద్దు చేయమని స్పీకర్‌కు ఇప్పటికే ఫిర్యాదు సమర్పించారు. వైఎస్ హామీ ఇచ్చాడని చెప్తున్న మొత్తం చేతికందే పరిస్థితి లేదు. మరొకప్రక్క కోవూరు నియోజకవర్గంలో అధికారులెవరూ ఆయన మాట విన్పించుకోవడం లేదు. వైఎస్ బ్రతికివుంటే, ఆయనకు కాంగ్రెస్ ఎమ్మెల్యే స్థాయిలో పనులు జరిగి వుండేవి. అనుచరులకు పదవులు వచ్చి వుండేవి. జిల్లామంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొంతకాలం ఆయన్ను తన భుజాల మీద మోశాడు. కోవూరు కాంగ్రెస్‌వాదుల అభీష్టానికి విరుద్ధంగా కొందరు తెలుగుదేశం వాదులను పార్టీలో చేర్చుకొన్నాడు. కోవూరు అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ పదవికి ప్రసన్న చెప్పిన పేరు సిఫార్సు చేశాడు. అయితే ఇప్పుడు రామనారాయణరెడ్డి భవిష్యత్తు సందేహంలో పడింది. మంత్రివర్గ విస్తరణ అంటూ జరిగితే ఆయన మంత్రిత్వం వూడి పోవచ్చునన్న వూహాగానాలు విన్పిస్తున్నాయి. దానితో మరీ ఒడ్డున పడిన చేప పిల్లవలె మారిపోయాడు ప్రసన్న. ఆ అయోమయంలో, గందరగోళంలో జనార్దనరెడ్డిని శరణు వేడడం మినహా వేరే దారి లేదని నిశ్చయానికి వచ్చినట్లున్నాడు.



మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డితో నల్లపరెడ్డి ప్రసన్న.

కొరవ 14వ పేజీలో



[మాఫియా పడగ నీడ]

కర్నాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప మెడలు వంచి తమ దారికి తెచ్చుకోవడంలో గాలి జనార్దనరెడ్డి సోదరుల బలప్రదర్శన దేశ రాజకీయాల పతనావస్థకు ప్రబల సంకేతంగా నిలుస్తుంది. బళ్లారి ప్రాంతంలో ఇనుప ఖనిజం అక్రమ త్రవ్వకాలకు గాలి జనార్దనరెడ్డి సోదరులు కేంద్ర బిందువులని అందరికీ తెలుసు. ఈ అక్రమ వ్యాపారంలో వేలకోట్లు మూటకట్టుకొన్నవారికి, అన్ని రాజకీయపార్టీలు దాసోహం అంటున్నాయి. కానీ యడ్యూరప్ప మాత్రం వారి ధన ప్రలోభాలకు లొంగలేదు. దేశ సంపద అయిన ఇనుప ఖనిజం కొందరు దోపిడీదారుల చేతిలో చిక్కుకపోవడాన్ని నివారించే ప్రయత్నం చేశారాయన. అది సహజంగానే గాలి సోదరులకు ఆగ్రహం తెప్పించింది. ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా కొన్నీ నోట్ల కట్టలు వెదజల్లి బిజెపి ఎమ్మెల్యేలను టోకున కొనుగోలు చేసి, యడ్యూరప్ప మీద తిరుగుబాటు ప్రకటించారు. ఇందుకోసం ఒక్కొక్క ఎమ్మెల్యేకు వారు ఐదు కోట్ల రూపాయల వరకు ముట్ట చెప్పారట. ఆ డబ్బు జబ్బు సోకిన దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు గాలి సోదరుల కాళ్ల ముందు తోకలు వూపుకొంటూ తిరిగే కుక్కల కంటే హీనంగా ప్రవర్తించారు. దీనితో ప్రభుత్వ ఉనికి ప్రమాదంలో పడింది. ఎల్.కె.అద్వానీతో సహా బిజెపి జాతీయ నేతలందరూ ఎంతగా నచ్చచెప్పినా గాలి సోదరులు మాట వినలేదు. తమ మాట చెల్లుబాటు కాకుంటే యడ్యూరప్ప ప్రభుత్వాన్ని పడగొట్టి తీరుతామని శపథాలు చేశారు. దానితో బిజెపి జాతీయ నాయకత్వం నిస్సహాయంగా వారికి తల ఒగ్గింది. వారి కోరిక ప్రకారం నిజాయితీ పరులైన అధికారులను బదలీ చేసి, ఇనుప ఖనిజం గనులలో అక్రమాలను అడ్డుకోబోమని ముఖ్యమంత్రి వద్ద హామీ తీసుకొని యడ్యూరప్ప పదవి కాపాడారు.

కర్నాటక రాష్ట్రం గత నెలలో చరిత్ర ఎరుగని తీవ్ర స్థాయిలో వరదలకు గురైంది. 200 మంది చనిపోయారు. లక్షలాది మంది తమ సర్వస్వాన్ని నీటిలో కోల్పోయారు. వుండడానికి ఇల్లు, తినడానికి తిండి లేక మల మల మాడిపోతున్నారు. ఆ వరద బాధితులకు ఆపన్న హస్తం అందించవలసిన సమయంలో తమ వ్యాపారాలు కాపాడుకోవడానికి గాలి సోదరులు, తన పదవిని కాపాడుకోవడానికి యడ్యూరప్ప నెలరోజుల పాటు ఢిల్లీలో మకాం పెట్టారు. ప్రజల మధ్య నిలబడి కన్నీళ్లు తుడవవలసిన ఎమ్మెల్యేలు హైదరాబాద్ ఫైవ్‌స్టార్ హోటళ్లలో అన్నిరకాల విలాసాలు అనుభవిస్తూ గాలి సోదరుల బండీలుగా కాలం గడిపారు. ఎంత హీనమైన పరిస్థితి?

గాలి సోదరుల దుర్మార్గపు ఒత్తిడికి తలవొగ్గడం ద్వారా బిజెపి పార్టీ దేశానికి తీరని అపకారం చేసింది. గాలి సోదరుల డబ్బును ఎదుర్కొనే స్థోమత పార్టీకి లేదన్న మాట నిజం. వారు విసిరేసే కొన్నీ కట్టలకు భ్రమసిన ఎమ్మెల్యేలు కుక్కల కంటే హీనంగా ప్రవర్తించిన మాట కూడా నిజం. అయితే ఇటువంటి మాఫియా విషసర్పాల పడగ నీడలో ప్రుగ్గిపోవడం కంటే, ప్రభుత్వాన్ని పడలుకొని, ప్రజల తీర్పు కోరడానికి సిద్ధ పడి వుంటే బిజెపి నిజమైన జాతీయపార్టీగా మన్ననలు అందుకొనేది. మాఫియా ముఠాల కాళ్ల ద్రగ్గర మోకరిల్లి తమ పార్టీ పరువే కాకుండా మొత్తం దేశం పరువే తీశారు బిజెపి అగ్రనేతలు.

కర్నాటకతోపాటుగా మన రాష్ట్రం మీద కూడా ఈ విషసర్పం పడగ నీడ సోకుతున్నది. ఓబుళాపురం గనుల విషయంలో జరుగుతున్నది అదే. అన్నిరకాల రాజకీయ విలువలను మంట కలుపుతున్న ఈ మాఫియా ముఠాల ఆట కట్టించడానికి అన్ని రాజకీయ పార్టీలు సమైక్యం కావడం అవసరం. లేకుంటే ప్రజాస్వామ్యం పట్టపగలు నట్ట నడివీధిలో మానభంగానికి గురౌతుంది. తెలుగుదేశం, సిపిఐ, సిపిఎం, లోక్‌సత్తా వంటి పార్టీలు ఇప్పటికే ఈ ప్రమాదాన్ని గుర్తించి, కొంత కదలిక చూపుతున్నాయి. వారితో కాంగ్రెస్, బిజెపి వంటి జాతీయపార్టీలు కూడా కలిసిపని చేయడం అవసరం. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలు, వ్యక్తిగత లాభాలు పక్కనపెట్టి ఈ మాఫియా మూకలను రాజకీయాల నుంచి తరిమి వేయడం అందరి ధర్మం. అందులో ఉపేక్ష పాటిస్తే దేశమే నష్టపోతుంది.

జనవాణి

ఎందుకీ రగడ?

రాష్ట్ర గీతమైన మా తెలుగుతల్లికి మల్లెపూదండ పాటను తెలంగాణా ప్రజలు పాడరాదని టిఆర్ఎస్ నాయకుడు కె.చంద్రశేఖరరావు, ఆయన అనుచరులు మూర్ఖపు వాదనలు చేస్తున్నారు. తెలుగు మాట్లాడే ప్రాంతంలోని వీరులను, వీరులను స్తుతిస్తూ శంకరంబాడి సుందరాచారి ఈ గీతాన్ని వ్రాశారు. స్వార్థపరులైన రాజకీయులు ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి అధికార పీఠాలను అధిరోహించాలన్న కుయుక్తితో రాష్ట్ర గీతంపై రగడ చేస్తున్నారు.

పి.అరుణకుమారి, నెల్లూరు

మంచి నిర్ణయం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.జి.బాలకృష్ణన్‌తో సహా 21 మంది న్యాయమూర్తులు తమ స్థిరచరాస్తులను వెల్లడించడం స్వాగతింపతగ్గ శుభపరిణామం. అత్యున్నత స్థానాలలో వున్న న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను బయటపెట్టడం న్యాయవ్యవస్థలోని మిగతా న్యాయమూర్తులకు మార్గం చూపుతుందనేది నిజాయితీపరులైన ప్రజలందరి ఆకాంక్ష. కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.డి.దినకరన్‌తోపాటు మరికొందరు న్యాయమూర్తులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటనతో న్యాయవ్యవస్థ కీర్తి విరాజిల్లడం ఖాయం.

పి.సత్యనారాయణ, నెల్లూరు

కమ్యూనిస్టులకు పరీక్షా సమయం

ఉభయదేశాల మధ్య కుదిరిన పంచశీలను సైతం కాలరాచి 1962లో భారత భూభాగాలను అక్రమంగా కబళించిన చైనా దుష్టబుద్ధిని భారత దేశం ఎన్నటికీ మరచిపోదు. ఇటీవల ఆ దేశం మళ్లీ మనదేశాన్ని కబళించే ప్రయత్నంలో అరుణాచల్‌ప్రదేశ్ తమదంటూ వింతవాదన చేస్తోంది. గతంలాగే భారతజాతి యావత్తు ఐక్యంగా నిల్చి చైనాను అడ్డుకోవాలి. దేశంలో మావోయిస్టుల దుందుడుకు పంథాను వ్యతిరేకిస్తున్న విధంగానే చైనా విస్తరణ విధానాన్ని భారత కమ్యూనిస్టుపార్టీలు తీవ్రంగా నిరసించినప్పుడే మాతృదేశంలో వారి వునికి నిలబడుతుంది. స్థారకమవు తుంది.

ఎం.రామమూర్తి, విశాఖపట్నం

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

17-11-1939
పేజీలు : 16 వెల: అణా

నెల్లూరు జిల్లాబోర్డు ప్రెసిడెంటు ఎన్నిక

వంగల్లు కోదండరామిరెడ్డిగారు ఏకగ్రీవంగా ఎన్నుకోబడిరి. ఈరోజు 17తేది 10గంటలకు జిల్లా బోర్డు భవనంలో జిల్లా కలెక్టరుగారు ఎన్నిక జరిపారు.

వంగల్లు కోదండరామిరెడ్డిగారి పేరును రేబాల దశరధరామిరెడ్డిగారు ప్రపోజు చేశారు. నేలంపాటి కాళపరెడ్డిగారు బలపరిచారు. మరొక అభ్యర్థి లేనందున పోటీలేకనే ఎన్నుకొనబడినటుల ప్రకటింప బడెను.

వైసు ప్రెసిడెంటు

ఈరోజు మధ్యాహ్నం 3గంటలకు నలమోతు చెంచురామానాయుడు గారు ఎన్నుకొనబడిరి.

ఈ ఎలెక్షనులో నిర్దాక్షిణ్య విమర్శల వల్ల ఎవరిన్నా వ్యక్తుల మనస్సులు నొప్పించియున్న యెడల అట్టివారి యందు నాకు వ్యక్తిగత ద్వేషాలేమీ లేవనిన్నీ, రాజకీయంలో అభిప్రాయభేదాలుగా భావించి క్షమించమనీ ప్రార్థిస్తున్నాము.

తిరుపతి వెంకటేశ్వరునికి బంగారు రథము

బంగారు రథము తిరుపతి వెంకటేశ్వరస్వామికి బంగారు రేకులతో రథము కట్టించుటకు కమిషనరుగారు ఒక తీర్మానాన్ని 25-11-39 తేది మీటింగులోనికి తీసుకరానున్నారు. దీని ఖర్చు ఒక లక్ష అరవైవేలు అగునట.

విద్యార్థులను కొట్టరాదు

ఎలిమెంటరీ పాఠశాలలో కూడా విద్యార్థులను కొట్టరాదని మదరాసు ప్రభుత్వం వారు వుత్తర్వు గావించారు.

50 ఏళ్ల క్రితం ఈవారం

13-11-1959
పేజీలు: 12 వెల: 0-3-0

నెల్లూరు ముచ్చట్లు

జిల్లాకాంగ్రెస్ అధ్యక్షత

జిల్లాకాంగ్రెస్ అధ్యక్ష కార్యవర్గ ఎన్నిక రేపు జరుగబోతున్నది. యువకుడు, వుత్సాహవంతుడైన వ్యక్తి ఎన్నుకోబడాలనే రాష్ట్రకాంగ్రెస్ సూచననుసరించి శాసనసభ్యుడు ఆనం సంజీవరెడ్డిగారు అధ్యక్షుడుగా ఎన్నికకాగలరు. గతంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ నిస్తబ్ధత దగ్గరున్న మనలనేకాదు, హైదరాబాదులో వున్న రాష్ట్ర కాంగ్రెస్ అధినేతలను గూడా అసంతృప్తి పరచింది. కడకు జాతిపిత గాంధీజీ జన్మదినోత్సవాన్ని గూడా జరుపలేని నిర్జీవసంస్థగా జిల్లా కాంగ్రెస్ తయారైనది. అటువంటి దౌర్భాగ్యస్థితియికనైన తొలగి, ప్రజల నిత్యజీవిత సమస్యలతో కాంగ్రెస్ కలసిమెలసి పనిజేయగలిగితే సంతోషిస్తాము.

టవున్‌లో వుత్సాహవంతులు, కాంగ్రెస్ అభిమానులు, యోగ్యులైన యువకులతో ఒక కమిటీని వేసి, చురుకుగా పనిజేయించవలసిందిగా సంజీవరెడ్డి గారిని కోరుతున్నాము.

జిల్లా పంచాయితీ ఆఫీసరు మారిపోయాడు

అవినీతి, అక్రమపాలన, అధికార దుర్వినియోగాలతో గ్రామాలలో చిచ్చుబెట్టాడనే నిందకు తీవ్రంగా గురియైన జిల్లా పంచాయితీ ఆఫీసరు డి.సుబ్బారెడ్డిగారు విశాఖపట్నంకు మార్చబడి, వారి స్థానంలో ఎస్.అప్పారావుగారు నియమించబడ్డారు. పంచాయతీ ఎన్నికలు పూర్తి అయిపోయిన తర్వాతైనా వీరిని మార్చినందుకు ఆంధ్రప్రభుత్వాన్ని అభినందిస్తున్నాము.

బాలికలను అపహరించే సాధువు

ఈ నెల 8తేది హాస్పిటల్ రోడ్డులో; మునిసిపల్ వుద్యోగి ఆర్యుగం భార్య మంగమ్మ మీద మత్తుమందు చల్లి, అందాకమ్మ అనే పదేళ్ల ఆమె కుమార్తెను అపహరించుకొనిపోగా బాలికతో గూడా ఆ సాధువును మరోరోజు చింతారెడ్డిపాళెంలో పోలీసు పట్టుకున్నది. తన పేరు దావిపాల్ అని, తాను మూడేళ్లుగా బ్రహ్మంగారి మఠంలో వుంటున్నానని ఈ సాధువు చెప్పాడట.

నెల్లూరు ముచ్చట్లు

కొళాయిల్లో నీరు రంగు మారాయి

నెల్లూరు నగరానికి మంచినీరు సరఫరా చేసే పెన్నానదిలోని బావులను వర్షపు నీరు ముంచెత్తడంతో 8తేది నుంచి కొళాయిల్లో రంగుమారిన నీళ్లు వస్తున్నాయి. ఇప్పటికే రకరకాల రోగాలతో ఇబ్బందిపడుతున్న నెల్లూరు ప్రజలు ఈ నీటిని యాధాతధంగా కాకుండా కాచి వడపోసి తాగడం మంచిదంటున్నారు డాక్టర్లు.

కూరగాయల మార్కెట్‌లో మోసాలపై జె.సి దృష్టి!

నెల్లూరులోని ఎసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌లో వినియోగదారులను దోచుకొంటున్న వ్యాపారులపై చర్యలకు జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ దృష్టి సారించారు. 8తేది కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ సమావేశంలో పలువురు ఎసి మార్కెట్‌లోని తూకం, ధరల దోపిడీ విషయాన్ని జె.సి ముందు ప్రస్తావించగా వెనువెంటనే అక్కడకు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి జ్వాలా ప్రకాష్‌ను తనిఖీకి పంపారు. నలుగురు వ్యాపారులు పాత తూకం రాళ్లతో వ్యాపారం చేయడాన్ని గుర్తించిన డిఎస్ఓ వారిపై కేసు నమోదు చేశారు. మార్కెట్‌లో ఇక నుంచి వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాటాలు వుపయోగించేలా చర్యలు తీసుకోనున్నారు. కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు తూకం, ధరల్లోనూ మోసం చేసే మాయగాళ్లు. వీరితో జెసి ఓసారి సమావేశమై వారి మానసిక ధోరణి మార్చేలా ప్రయత్నించాల్సి వుంది.

సిడి షాపులపై పోలీసు దాడులు

నెల్లూరు నగరంలోని సిడి షాపులపై 9తేది సాయంత్రం నగర డిఎస్పీ రాధికారెడ్డి దాడులు నిర్వహించారు. 500పైగా సీలిచిత్రాలు, పైరసీ సిడిలను స్వాధీనం చేసుకొని ఆరుగురిని అరెస్ట్ చేశారు. నగరంలోని కొంతమంది సిడిషాపుల నిర్వాహకులు నీలిచిత్రాలను విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో డిఎస్పీ ఎసిసెంటర్, రామలింగాపురం, ట్రంకురోడ్డు ప్రాంతాలలోని షాపులపై దాడులు నిర్వహించారు. రామలింగాపురంలోని సిడిలషాపు నిర్వాహకుడు ఇక్కడి విద్యార్థులకు నీలిచిత్రాల సిడిలు విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం వుండడంతో డిఎస్పీ ఆ షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. నీలిచిత్రాల విక్రయాలు జరిపితే సిడిలమ్మేషాపులను సీజ్ చేస్తామని డిఎస్పీ హెచ్చరించారు.

వర్షంతో వంటగ్యాస్ ధరలకు రెక్కలు

గతవారం కురిసిన వర్షాలతో నగరంలో వంటగ్యాస్ సిలిండర్లకు ఎక్కడలేని డిమాండ్ పెరిగింది. దీంతో 311రూపాయలకు దొరికే సిలిండర్ బ్లాక్ మార్కెట్‌లో 700రూపాయలు పలుకుతుంది. ప్రతి ఒక్కరు స్నానానికి వేడి నీటిని వాడుతుండడంతో వాటికి డిమాండ్ వచ్చి పడింది. గ్యాస్ ఏజన్సీల నిర్వాహకులు గృహవినియోగదారులకు సిలిండర్లు ఇవ్వకుండా వాణిజ్య అవసరాలకు వినియోగించే వారికి భారీ మొత్తాలునొక్కి ఇవ్వను శ్రద్ధ చూపిస్తుండడంతో జనం గ్యాస్‌ను బ్లాక్ మార్కెట్‌లో కొనక తప్పడం లేదు. రేషన్ షాపులను తనిఖీ చేసిన తీరులోనే జాయింట్ కలెక్టర్ గ్యాస్ ఏజన్సీలను తనిఖీచేస్తే గ్యాస్‌సిలిండర్లు సామాన్యులకు అందుబాటులోకి వస్తాయి.

70 టిఎంసిల నిల్వకు రంగం సిద్ధం

జిల్లాలో ఈయేడాది వర్షాలు తక్కువగా పడినా కృష్ణానదికి తీవ్రమైన వరద రావడంతో అక్టోబర్ నెలాఖరుకు సోమశిల ప్రాజెక్టులో 60టిఎంసిల నీళ్లు వచ్చి చేరాయి. ఈశాన్య బుతుపవనాల ప్రభావం వల్ల గతవారం కడపజిల్లాలోనూ మంచి వర్షాలు పడడంతో వరద నీరు క్రమక్రమంగా ప్రాజెక్టుకు వచ్చి చేరుతున్నది. ఈసారి 70టిఎంసిల నీటిని ప్రాజెక్ట్‌లో నిల్వ చేయాలని నీటిపారుదల శాఖాధికారులు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకొన్నారు. గతంలో ఎప్పుడూ ప్రాజెక్ట్‌లో ఈమాదులో నీళ్లు నిల్వ చేసిన చరిత్ర లేదు.

తిరిగివచ్చిన కలెక్టర్

వారం రోజులపాటు నెదర్లాండ్, డెన్మార్క్, ఇజ్రాయిల్ దేశాలలో వ్యవసాయ అనుబంధిత పరిశ్రమల అధ్యయనానికి ఇఫ్కో బృందంతో కలసి వెళ్లిన కలెక్టర్ కె.రామ్‌గోపాల్ 5తేది నెల్లూరు తిరిగి వచ్చారు. పర్యటించిన దేశాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడడం వల్ల పాల దిగుబడులు, సాగునీటి విధానం బ్రహ్మాండమంటున్నారు కలెక్టర్ గారు. కలెక్టర్‌గారి అనుభవాలను జిల్లా రైతులు వుపయోగించుకోవాల్సి వుంది.

జగన్‌ను పరామర్శించిన పార్వతమ్మ

కావలి మాజీ శాసనసభ్యురాలు మాగుంట పార్వతమ్మ 5తేది హైదరాబాద్‌లో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్‌జగన్మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకొన్నారు.

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి రూపంలో మాత్రమే పంపగలరు. చిల్లులు స్వీకరించబడవు.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

సిఎంను కలసిన జనార్దన్‌రెడ్డి

ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యను మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 5తేది హైదరాబాద్‌లో కలిశారు. జిల్లాలో ఇటీవల రాజకీయ పరిణామాలను రోశయ్యకు జనార్దన్‌రెడ్డి వివరించినట్లు తెలిసింది.

రోశయ్య వెనుక పనబాక

ముఖ్యమంత్రి రోశయ్య 7తేది జరిపిన ఢిల్లీ పర్యటనలో కేంద్ర జౌళి శాఖ సహాయమంత్రి పనబాకలక్ష్మి ఆద్యంతం అనుసరించడం చర్చనీయాంశమయ్యింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఢిల్లీ పర్యటనకు వెళ్తే ఆమె ఆంధ్రాభవన్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలసి వెనక్కు వచ్చేసేవారు. ఈసారి పాత అలవాటును మాని కొత్త అలవాటును నేర్చుకొన్నారు.



ఆంధ్రప్రదేశ్ పర్సింగ్ ఆర్టిస్ట్స్ ఫెడరేషన్ హైదరాబాద్ కార్యాలయ నిర్వహణ కోసం లక్ష రూపాయల చెక్కును ఐఎఫ్‌డబ్ల్యుజె అధ్యక్షుడు విక్రమ్‌రావుకు అందిస్తున్న యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పుడు. ప్రక్కన యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు.

నష్టపరిహారమేది?

నెల్లూరు బొల్లినేని కంటివైద్యశాలలో ఆపరేషన్లు వికటించడంతో 16 మంది కంటి చూపును కోల్పోయిన విషయం పాఠకులకు విదితమే. వీరికి లక్షా50వేల రూపాయల చొప్పున పరిహారం చెల్లిస్తామని చెప్పిన హాస్పిటల్ యాజమాన్యం నేటికీ ఆ మొత్తం చెల్లించలేదు. ప్రభుత్వం మాత్రం వీరికి 50వేల రూపాయల చొప్పున చెల్లించి చేతులు దులుపుకొంది. బాధితులంతా పేదలు కావడంతో బొల్లినేని యాజమాన్యం సాచివేత ధోరణి అవలంభిస్తున్నది.

నెల్లూరులో బి.వి.రావు జయంతి!

భారతదేశ కోళ్లపరిశ్రమ పితామహుడు పద్మశ్రీ డాక్టర్ బివిరావు జయంతిని నేషనల్ ఎగ్‌కోఆర్డినేషన్ కమిటీ 6తేది నెల్లూరు నవాబుపేటలోని బాలాజీ హేచరీలో జరిపింది. నెక్ మాజీ ఛైర్మన్ ఎస్.బలరామయ్య నాయుడు బి.వి.రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉడికించిన కోడిగుడ్లను స్వర్ణభారత్ ట్రస్ట్‌లోని ఉత్తరాదేవి మెమోరియల్ హాస్పిటల్‌లోని రోగులకు, బ్రిడ్జిస్కూల్ విద్యార్థులకు, పెద్దల ఆశ్రమం, విశ్వోదయ అంధుల పాఠశాలలోని విద్యార్థులకు పంచారు.

695 కిలోమీటర్ల మేర రోడ్డు దెబ్బతినింది

గతవారం రోజులుగా జిల్లాలో కురిసిన వర్షాలకు రోడ్లు భవనాల శాఖకు చెందిన 137 రహదార్లు 695కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయని ఆ శాఖ ఎస్ఇ శ్రీధర్ చెప్పారు. బుచ్చి – ముంబాయి జాతీయ రహదారి మీద రోజుకు 2,600 లారీలు ఐరన్‌ఓర్‌తో తిరుగుతుండడం వల్ల ఈరోడ్డు బాగా దెబ్బతినిందన్నారు. ఈలారీలను ఆపితే గాని ఈరోడ్డును రిపేరు చేయలేమన్నారు. ఈరోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు 1280కోట్ల రూపాయలను కేంద్రప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

స్పందన ప్రసాద్ రాజీనామా

ప్రజారాజ్యం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి స్పందన ప్రసాద్ రాజీనామా చేశారు. రోశయ్య ముఖ్యమంత్రి కావడంతో ఆ కులస్తుడైన ప్రసాద్ కాంగ్రెస్‌లో చేరను మార్గం సుగమం చేసుకొంటున్నట్లు తెలిసింది.

సూపర్‌ఫైన్ బియ్యం అమ్మకాలు

మార్కెట్‌లో కిలో 34రూపాయలు అమ్ముతున్న సూపర్‌ఫైన్ రకం బియ్యాన్ని పౌరసరఫరాశాఖ 26రూపాయల చొప్పున నగరంలో అమ్మిస్తుంది. దీనికోసం నగరంలోని వివిధ ప్రాంతాల్లోని నమ్మకమైన పది షాపులను ఎంపిక చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి జ్వాలాప్రకాష్ చెప్పారు.

పెన్నాబ్యారేజ్ పనులకు అంతరాయం

నత్తనడకన సాగుతున్న నెల్లూరు పెన్నాబ్యారేజ్ పనులకు గతవారంలో కురిసిన వర్షం మరింత అంతరాయంగా మారింది. సోమశిల ప్రాజెక్టు నుంచి నీళ్లు వదలకపోయినా ఆత్మకూరు ప్రాంతంలోని వాగులు, వంకలు వుధృతంగా ప్రవహించడంతో పెన్నాలో ప్రవాహం హెచ్చింది. బ్యారేజ్ పనులను చేపట్టను నిర్మించిన కట్టను తెగగొట్టిన నీరు పని చేస్తున్న ప్రాంతాలని

కొరవ 14వ పేజీలో

బంగారం స్పెషల్ ఆఫర్

BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై సవరకు రూ.400/- తగ్గింపు. గ్రాముకు రూ.50/- తగ్గింపు. డైమండ్స్ పై 10% తగ్గింపు.

గోల్డ్ ప్యాలస్

హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్, ఆచారివీధి, నెల్లూరు. ఫోన్: 2331133, 2327611


అమ్మ ఫర్నిచర్స్

"A House of Life style furnitures"

గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంటీరియర్ ఫర్నిచర్స్

రాపూర్ మెయిన్‌రోడ్, నెల్లూరు. ఫోన్: 92464 56666, 98494 56666

కరువుతీరా వాన!



పెన్నమ్మ పరవళ్లు

ఈశాన్య ఋతుపవనాలు కరుణించడంతో ఎప్పటిమాదిరిగానే ఈ యేడు నవంబరు మొదటి వారంలో జిల్లా అంతటా కరవుతీరా వానలు పడ్డాయి. సహజంగా జిల్లాలో నవంబరు నెల మొత్తంమీద 313 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి వుండగా 5, 6, 7, 8 తేదీల్లోనే 354.5 మిల్లీమీటర్ల వర్షం నమోదయ్యింది. 8వ తేది వరకు కురిసిన వర్షం వల్ల జిల్లాకు మేలు జరిగిందనాలి. సోమశిల, కండలేరు, కనిగిరి రిజర్వాయర్లు జలకళతో కళకళలాడుతున్నాయి. కైవల్యానది, నెర్రికాలువ, పంబలేరు, వీరాపేరు, కొమ్మలేరు, పైడేరుకాల్వ పొంగి ప్రవహిస్తున్నాయి. విచిత్రంగా జలదంకి మండలంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యింది. దీనివల్ల ఈ మండలంలో చామదల, దరిశి అగ్రహారం, లింగరాజు అగ్రహారం చెరువులు తెగాయి. ఎప్పుడోగాని నిండని అక్కరాజువారి చెరువు, ముంగమూరు చెరువులు నిండాయి. జిల్లాలో పెద్ద చెరువులైన అల్లూరు, రామన్న చెరువులు పొంగి పొర్లుతున్నాయి. రామన్న చెరువు వద్ద కలుజు పారుతుండడంతో కావలి – అల్లూరు మధ్యలో బస్సులు తిరగడం కష్టంగా వుంది. జలదంకి మండలంలో చామదల, గుడ్లదిన్నె, కమ్మవారిపాళెం, బోగోలు మండలంలో తాళ్లూరు, దగదర్తి మండలంలో చవట పుట్టేదు, విడవలూరు మండలం వరిజి వద్ద రహదారులు దెబ్బతిన్నాయి. కలెక్టర్ రాంగోపాల్ వర్షమని ఆలోచించక 8వ తేది జలదంకి, కావలి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. సాయంత్రానికి నెల్లూరు చేరుకొన్న మంత్రి రామనారాయణరెడ్డి చెరువు ప్రక్కనే వున్న పినాకినీ గెస్ట్ హౌస్‌లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా మొత్తం మీద 40 చెరువులు తెగాయని, 46.18 కోట్లు అన్ని శాఖలకు నష్టం వాటిల్లినట్లు వివరించారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా వుందన్నారు. దెబ్బతిన్న రోడ్లను 24 గంటల్లో పునరుద్ధరిస్తామన్నారు. గూడూరు, కావలి డివిజన్లలో ఎక్కువ వర్షపాతం నమోదయ్యింది. పదేళ్లకొకసారి నిండే రాళ్లపాడు ప్రాజెక్టు కూడా నిండిందంటే ఈ నాలుగు రోజుల్లో మెట్ట ప్రాంతాల్లో ఏమేరకు వర్షాలు పడ్డాయో అర్థం చేసుకోవచ్చు.

నెల మొత్తం కురవాల్సింది నాలుగు రోజుల్లోనే కురిసింది



బొల్లినేని ఆసుపత్రి వద్ద దెబ్బతిన్న రోడ్డు

● కష్టంగా మారిన ట్రాఫిక్ నడత!

నగరంలో దెబ్బతిన్న రోడ్లు!

5, 6, 7, 8 తేదీల్లో కురిసిన వర్షం నెల్లూరు నగర ప్రజలకు ఎంతో మేలు చేసిందనవచ్చు. ఈ యేడాదిలో ఇప్పటివరకు చెప్పుకోతగ్గ వర్షం లేకపోవడంతో భూగర్భజలాలు బాగా అడుగంటాయి. నెల్లూరు చెరువు ప్రక్కనే వున్న ప్రాంతాల్లోని బావుల్లోనూ ఊట అదృశ్యమయ్యింది. గడచినవారంలో రికార్డు స్థాయిలో 19 సెంటీమీటర్ల వర్షం కురవడంతో బావుల్లో నీరు కనపడుతుంది. నగరంలో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా వుండడంతో ఎప్పటిమాదిరిగానే ఎక్కడి కక్కడ వర్షపునీరు నిలిచిపోయింది. ఆత్మకూరు బస్టాండ్ అండర్‌బ్రిడ్జి దగ్గర 7, 8 తేదీల్లో నీళ్లు నిలచిపోయాయి. ముత్తుకూరు బస్టాండ్, విజయమహల్ గేటు బ్రిడ్జిలు నీటితో నిండిపోగా కార్పొరేషన్ అధికారులు మోటార్లు పెట్టి నీళ్లు తోడుతూ కనిపించారు. బోసుబొమ్మ కనకమహల్ సెంటర్, ఎసి బొమ్మ, గాంధీబొమ్మ, కస్తూరిదేవిస్కూల్, బొల్లినేని ఆసుపత్రి, పెద్దాసుపత్రి వద్ద నీళ్లు నిలబడి రోడ్డు బాగా దెబ్బతిని గుంటలు పడిపోయింది. మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం దగ్గర ఈమధ్యే వేసిన రోడ్డుకు వాడిన కంకర బయటపడింది. ఇక్కడ సెంట్రల్ లైటింగ్ కోసం త్రవ్విన గుంటల ప్రక్కన రోడ్డు ధ్వంసమయ్యింది. వన్‌టౌన్ ప్రాంతంలో డ్రైనేజ్‌రోడ్డు నుంచి మూలాపేట పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు రోడ్డు బజ్జిబజ్జిగా తయారయ్యింది. వహాబ్‌పేట, కళ్యాణి ఫిలిమ్స్‌రోడ్డు, సండేమార్కెట్ వద్ద వర్షం కురుస్తున్న సమయంలో నడుములోతు నీళ్లు ప్రవహించాయి. ఈ మధ్య నగరంలోని కొన్ని పంట కాల్వలలో వ్యర్థాలు తీయడం వల్ల వర్షపు నీటి ప్రవాహంతో ఇవి కొంతమేర శుభ్రపడ్డాయి. కోటిరూపాయల మేర నిధులు వెచ్చించిన మన్సూర్‌నగర్, ఖుద్దూస్‌నగర్‌లలో ఎప్పటి మాదిరిగానే నీళ్లు నిలబడిపోయాయి. దెబ్బతినిపోయిన ట్రంకురోడ్డుతోపాటు ప్రక్క రోడ్ల మరమ్మత్తులు చేయకుంటే నగరంలో వాహనాలు, చివరికి కాలినడక కూడా నరకప్రాయంగా మారడం ఖాయం.


అనాధ పిల్లలకు అయ్యప్ప మాలలు

నెల్లూరు నగరంలో కొందరు అనాధ పిల్లలకు అయ్యప్పమాలలు వేసి వారి చేత భిక్షాటన చేయిస్తూ వ్యాపారం చేస్తున్నారు. విజయవాడ, విశాఖపట్నంల నుంచి కొందరు పిల్లలను తీసుకొచ్చి అయ్యప్పమాలలు వేయించి నగరంలో ఎంపికచేసిన ప్రాంతాల్లో వీరితో యాచన చేయిస్తున్నారు. నవంబరు, డిశంబర్ నెలల్లో అయ్యప్పమాలల్లో కనిపించి యాచన చేస్తే లేదనే వారు అరుదుగా వుండడం వల్ల సాయంత్రానికి వీరు సెంటర్‌ను బట్టి రెండు వందల రూపాయల వరకు సంపాదిస్తున్నారు. యాచన చేసే పిల్లల భాషలో తేడా వుండడం గమనిస్తే వీరు ఏ ప్రాంతీయులన్నది అర్థమవుతుంది. రైల్వేస్టేషన్, ఆత్మకూరు బస్టాండ్, ట్రంకురోడ్డు, పొగతోట, ఆర్టీసి బస్టాండ్‌ల వద్ద అయ్యప్పమాల ధారులైన పిల్లలు ఎక్కువగా కనిపిస్తున్నారు. వీరిని మైపాడుగేటు ప్రాంతంలోని బాడుగ ఇళ్లలోపెట్టి మరీ యాచన చేయిస్తున్నారంటే నెల్లూరు నగరంలో యాచన ఎంత దగుల్బాజీ దందాగా మారిందో అర్థం చేసుకోవచ్చు. స్థానికంగా పసిపిల్లలను సంకల్లో పెట్టుకొని, యువతులకు పెళ్లి అని యాచించే వారికి, అయ్యప్పమాలలు ధరించిన పిల్లలకు వివిధ సెంటర్లలో స్థానికతపై గొడవలు సైతం జరుగుతున్నాయి. నగరంలో యాచన కేంద్రాలుగా మారిన గాంధీనగర్ సాయిబాబా మందిరం, రాజరాజేశ్వరమ్మ దేవస్థానం, బారాషహీద్ దర్గా దగ్గర యాచనకు కొత్త బిచ్చగాళ్లను అనుమతించరు. నెల్లూరులో యాచన వ్యాపారం అయ్యిందనే దానికి ఈ వ్యవహారాలే సజీవ సాక్ష్యాలు.

సీజనల్ యాచనకో ఎత్తుగడ

చేతకాని మేయర్

రాజీనామాకు డిమాండ్ చేసిన డిప్యూటీ మేయర్



నెల్లూరు కార్పొరేషన్ సమావేశాల నిర్వహణలో విఫలమవుతున్న మేయర్ భానుశ్రీ తక్షణం ఆ పదవికి రాజీనామా చేయాలని డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు సలహా యిచ్చారు. 6వ తేది కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. కార్పొరేషన్ పాలకవర్గమంటే ఆనం జయకుమార్‌రెడ్డి ఒక్కరేకాదని మరో 49 మంది కార్పొరేటర్లు వున్నారన్న విషయం మేయర్ మరచిపోతున్నారు. కౌన్సిల్‌లో అజెండాపై చర్చించకుండా ఆమోదించడం సిగ్గుచేటు. ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో పాత మేయర్, కొత్త మేయర్ భానుశ్రీలు విఫలమయ్యారు. నగర ప్రజలను సవాలక్ష సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. కానీ వాటిపై చర్చించే తీరిక, ఓపిక అధికారపక్షానికి లేదు. రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా కార్పొరేషన్‌లో ఆల్‌పాస్ సంస్కృతిని ప్రవేశపెట్టారు. రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి పెత్తనం, భానుశ్రీ ఆయన మాటలను జవదాటనితనం వల్ల నగరాభివృద్ధి కుంటుబడిపోయిందని డిప్యూటీ మేయర్ వాపోయారు.

కంటి వైద్యులంటే గడగడ

సర్వేంద్రియానం నయనం ప్రధానం. అలాంటి విలువైన కళ్లకు చికిత్సచేసే విషయంలో ఇటీవల బొల్లినేని కంటి వైద్యశాల వ్యవహరించిన తీరుతో పలువురికి కళ్లను తీసేయాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. అదేమాదిరిగా వెంకటాచలం వద్ద గల ఒక ట్రస్టులో హైదరాబాద్‌కు చెందిన కంటి ఆస్పత్రి నిర్వహించిన కంటి ఆపరేషన్లలోనూ పలువురు కంటిచూపు కోల్పోయారు. ఈ రెండు సంఘటనలతో ఇప్పుడు కంటి డాక్టర్ వద్దకు వెళ్లాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. కంటి వైద్యులు సైతం జాగ్రత్తగా రోగులను పరీక్షిస్తున్నారట. ఎంతబాగా చూస్తున్నా రోగులను మాత్రం భయం వెన్నాడుతోంది. డాక్టర్లను పలు ప్రశ్నలు వేసి తమ అనుమానాలు నివృత్తి చేసుకొంటున్నారట. వీరి దెబ్బకు డాక్టర్లు సైతం బెంబేలు పడిపోతున్నారు. చిన్న చిన్న కంటి జబ్బులకు సైతం డాక్టర్లు వ్రాసిన మందులు ఏమిటి? డ్రాప్సు ఏంటంటూ ఆరాతీస్తుండడంతో రోగులు అడిగే పలు ప్రశ్నలకు సందేహాలు చెప్పలేక డాక్టర్లు బిక్కచచ్చిపోతున్నారు.

నమ్మకం పోగొట్టుకొన్న కంటి డాక్టర్లు

● జిల్లా ప్రజలను

వణికిస్తున్న విషజ్వరాలు!

జిల్లాలో విషజ్వరాలు విజృంభించి ప్రజలు అనారోగ్యం పాలై మృత్యువాత పడుతున్నారు. అక్టోబర్ నెల నుంది ప్రారంభమైన విషజ్వరాలు రోజురోజుకీ అధికం అవుతున్నాయి. వీటి నివారణ కోసం రాష్ట్రప్రభుత్వం, వైద్య, ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టడంలో వైఫల్యం చెందుతున్నాయి. విషజ్వరాల బారినపడిన రోగులు వైద్యం కోసం ఆసుపత్రుల వద్ద బారులుతీరుతున్నారు. ఇప్పటికే జిల్లాలో విషజ్వరాల కారణంగా పదిమందికి పైగా మరణించారు.

గ్రామీణులకు ఇబ్బంది

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో వుంటున్న వారిని విషజ్వరాలతోపాటు అత్యంత ప్రమాదకరమైన డెంగ్యూ జ్వరాలు సోకుతున్నాయి. ఈ సీజన్‌లో వర్షాలకు తడిస్తే సాధారణంగా జ్వరాలు వస్తుంటాయి. సాధారణ జ్వరాలు రెండు, మూడు రోజుల్లో తగ్గిపోతుంటాయి. జ్వరం వచ్చి వారం రోజులైనా తగ్గకపోవడంతో జిల్లా కేంద్రానికి వచ్చి వైద్య చికిత్సలు పొందే సమయంలో మృత్యువాత పడుతున్నారు. మామూలు జ్వరమా? లేక డెంగ్యూ జ్వరమా అనేది వైద్యులు కూడా ముందుగా నిర్ధారించలేకపోతున్నారు. ఇందుకు సంబంధించిన పరీక్షా పరికరాలు, జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు వైద్యశాలల్లో అందుబాటులో లేవు.



నెల్లూరు రామచంద్రారెడ్డి ఆస్పత్రిలో అవుట్ పేషంట్ విభాగంలో చికిత్స కోసం వేచి చూస్తున్న జ్వరపీడితులు.

వైద్యఆరోగ్య శాఖ కుంభకర్ణ నిద్ర

గ్రామీణ ప్రాంతాలలో పర్యటించి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతుల గురించి ప్రచారం చేయాల్సిన బాధ్యత వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందిపై వుంటుంది. అలాగే వీరి పనితీరును నిత్యం పర్యవేక్షించాల్సిన ఇతర అధికారులు సైతం జిల్లా కేంద్రాన్ని వదలి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లడం లేదు. దీంతో వ్యాధి నయం కావడం కోసం గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి రాక తప్పడం లేదు. సీజనల్ వ్యాధుల నివారణ కోసం కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నా ప్రజలకు మాత్రం మందులు అందడం లేదు.

డెంగ్యూ జ్వరంతో మరణాలు

డెంగ్యూ జ్వరంతో ప్రతిరోజు ఏదో ఒక మండలంలో ఒకరు చనిపోతున్నారు. అయితే జిల్లా అధికారులు, వైద్య, ఆరోగ్యశాఖాధికారులు ఇతర ప్రజాప్రతినిధులలో ఎటువంటి స్పందన కానరావడం లేదు. డెంగ్యూ జ్వరానికితోడు స్ట్రెప్టూ, కామెర్ల వ్యాధులు కూడా వ్యాప్తి చెందుతున్నాయి. వ్యాధుల బారి నుంచి రక్షించాలని ప్రజలు గగ్గోలు పెడుతున్నా ఆలకించేదిక్కు లేకుండా పోయింది. కనీసం వున్న సిబ్బందిని కూడా అప్రమత్తం చేయలేక పోతున్నారన్న విమర్శలు వున్నాయి. వ్యాధుల వ్యాప్తికి త్రాగునీరు, పారిశుద్ధ్యం దోమల విజృంభణ కారణమవుతున్నాయి.

పారిశుధ్య లోపం

మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాల్టీలతో పాటు, గ్రామ పంచాయితీల పరిధిలో కూడా పారిశుద్ధ్యం చాలా అధ్వాన్నంగా వుంది. పారిశుద్ధ్యం లోపించడం వల్ల దోమలు ఉత్పత్తి చెంది అంటు వ్యాధులతోపాటు ప్రమాదకరమైన డెంగ్యూ, విషజ్వరాలు సోకుతున్నాయి. కొళాయిల ద్వారా సరఫరా అయ్యే త్రాగునీరు కలుషితమైతే విషజ్వరాలు వ్యాపించే అవకాశం వుందని వైద్య నిపుణులు అంటున్నారు. వ్యాధి వ్యాపించిన తర్వాత ఇబ్బందిపడే బదులు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిస్తే వ్యాధులు నివారించవచ్చని వైద్యుల అభిప్రాయం.

మునిసిపాల్టీలతోపాటు గ్రామపంచాయితీల పరిధిలో ప్రస్తుతం పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచకుండా వారోత్సవాలు నిర్వహించేందుకు అనుమతిచ్చిన అధికారుల తీరుపై ప్రజలు మండిపడు తున్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరచేందుకు గ్రామ పంచాయితీలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు నిధులు మంజూరు చేసింది ప్రభుత్వం. అయితే ఈ నిధులు ఏమయ్యాయో తెలియదుగాని గ్రామీణ ప్రాంతాలలో మురికి ముద నష్టాలు మూడుపువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయి.

పారిశుద్ధ్యం లోపించడం, త్రాగునీరు కలుషితం కావడం వంటి కారణాలతో డెంగ్యూ, విషజ్వరాలు, కామెర్లు వ్యాపిస్తున్నాయని స్వయంగా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులే ప్రకటన చేశారు. ఇందుకు సంబంధించి అవసరమైన చర్యలు ఎప్పుడు తీసుకుంటారన్న విషయాన్ని చెప్పకుండా దాటేస్తున్నారు.

డెంగ్యూ లక్షణాలు

దోమకాటు కారణంగా డెంగ్యూవ్యాధి సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. శరీరం లోపల రక్తస్రావం, చెవి, ముక్కుల నుంచి రక్తం కారడం వంటివి ఈ జ్వరం లక్షణాలు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో మురికి నీరు నిల్వ వుండడం వల్ల దోమలు ఉత్పత్తి చెందే ప్రమాదం వుందంటున్నారు.

డెంగ్యూ జ్వరం చాపక్రింద నీరులా వ్యాప్తి చెందడంతో ఇప్పటివరకు జిల్లాలో పదిమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఆత్మకూరు చెందిన సోమయ్య (39), కొండాపురం మండలానికి చెందిన తెలుగుదేశం నాయకుడు వెంకటేశ్వర్లు, చిల్లకూరు మండలానికి చెందిన విఆర్వో శ్రీనివాసులరెడ్డి, పొందలకూరు మండలం దేగపూడికి చెందిన నరసింహాలు, బోగోలుకు చెందిన సమీరారెడ్డి, తోటపల్లిగూడూరు మండలం కోడూరుకు చెందిన వెంకటరమణయ్య, కావలికి చెందిన జాఫర్, ఆత్మకూరుకు చెందిన రమణారెడ్డి మరణించిన వారిలో వున్నారు. నెల్లూరు నగరంలోని వివిధ కార్పొరేట్ ఆసుపత్రులలో మరో పదిమందికి పైగా డెంగ్యూవ్యాధికి చికిత్స పొందుతున్నారు. అధికారిక లెక్కలు పై విధంగా వుండగా అనధికారికంగా బాధితులు వందల సంఖ్యలో వున్నారు.

డెంగ్యూ జ్వరం సోకిన వారికి ప్లేట్‌లెట్స్ ఎక్కించాలి. ప్రస్తుతం రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులోనే వీటిని తయారుచేస్తున్నారు. ఇవి ఏమాత్రం చాలడం లేదు.



నెల్లూరు పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు.

> పారిశ్రామికంగా పరుగులు తీస్తున్న జిల్లాలోని ప్రజలను వైరల్, టైఫాయిడ్‌లకు తోడుగా చికున్‌గున్యా, డెంగ్యూ జ్వరాలు వణికిస్తున్నాయి. డెంగ్యూ జ్వరాలతో పదిమందికిపైగా ప్రాణాలు కోల్పోయినా ఇటు ఆరోగ్యశాఖాధికారులు, అటు పాలకుల్లోగానీ స్పందన లేకపోవడం విచారకరం

డెంగ్యూతో ప్రమాదమే!



జిల్లావ్యాప్తంగా డెంగ్యూ జ్వరం సోకి అనేకమంది మరణించగా, మరి కొందరు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. వ్యాధిసోకిన వెంటనే నిర్ధారణ చేసేందుకు పరికరాలు అందుబాటులో లేవు. ప్లేటిలెట్స్ తయారుచేసే పరికరం రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో మాత్రమే వుంది. ప్రభుత్వం ఎందువల్లనో ఈ జ్వరం గురించి పట్టించుకోలేదు. ఇంటిలో నిల్వ వున్న నీటిలో పెరిగే టైగర్ అనే దోమ కాటువేయడం వలన డెంగ్యూ వస్తుంది. వులిచారలు కలిగిన ఈ దోమ పగటిపూట మాత్రమే కుడుతుంది. ఇంటిలో నీరు నిల్వ లేకుండా చేసుకుంటే వ్యాధి బారినపడకుండా వుండవచ్చు.

డా॥ జి.విజయకుమార్,
ఐఎంఎ అధ్యక్షుడు, నెల్లూరు

పారిశుధ్యం పట్ల దృష్టి



జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్రాగునీరు కలుషితం కావడం, పారిశుద్ధ్యం అధ్వాన్నంగా వుండడం వంటి కారణాల వలన డెంగ్యూ, చికెన్‌గున్యా ఇతర జ్వరాలు వ్యాపించే అవకాశం వుంటుంది. వీటిని అరికట్టే అన్నిచర్యలు తీసుకోవడంతోపాటు మందులు కూడా సిద్ధం చేస్తున్నాం.

డా॥ సురేష్‌కుమార్,
ఇన్‌ఛార్జి డిఎంఅండ్‌హెచ్‌ఓ



వరదబాధితులకు ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని జిల్లా కలెక్టర్ రాంగోపాల్‌కు అందిస్తున్న ఇందుకూరుపేట జర్నలిస్ట్ గవిని చక్రపాణి.

ముత్తుకూరులో ఇళ్లకు డిమాండ్!

విపరీతంగా పెరిగిన బాడుగలు

ముత్తుకూరులో అద్దె ఇళ్లకు డిమాండ్ ఏర్పడింది. కృష్ణపట్నం పోర్టులో పనిచేసే సిబ్బంది అధికసంఖ్యలో వుండడంతో ఈ ప్రాంతంలో ఇళ్లకు గిరాకీ వచ్చింది. పోర్టుతోపాటు రిలయన్స్ విద్యుత్ ప్రాజెక్టు, జెన్‌కో, ఆయిల్ రిఫైనరీ పరిశ్రమలు రావడంతో అక్కడ పనిచేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి కార్మికులు, వారి కుటుంబాలు తరలిరావడంతో ముత్తుకూరు పరిసర ప్రాంతాలలో బాడుగ ఇళ్లకు డిమాండ్ పెరిగింది. కార్మికులతోపాటు సెక్యూరిటీ సిబ్బంది అధికంగా వుండడంతో చిన్న చిన్న ఇళ్లకు సైతం అధికమొత్తంలో బాడుగ చెల్లించాల్సి వస్తోంది. సరైన వసతి సౌకర్యాలు లేని కాంపీల్లో కూడా ఇళ్లకోసం ఎగబడుతున్నారు. బాడుగ ఇళ్ల అవసరాన్ని గుర్తించిన పలువురు స్థానికులు తమ ఇళ్లకి చిన్న చిన్న మార్పులు చేసి ఎక్కువమందికి బాడుగకు ఇచ్చి వేలాది రూపాయలను నెలనెలా అద్దె రూపంలో వసూలు చేస్తున్నారు. చిన్న చిన్న గదుల్లోనే 10నుంచి 15 మంది వరకు ఉద్యోగులు నివసిస్తూ పర్మకుపోతున్నారు.

- ఇద్దరు లబ్ధిదారులకు ఒకే ఇల్లు

ఇందిరమ్మ ఇళ్లే నిర్మాణాల్లో చిత్రవిచిత్రాలు!

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో పలు అక్రమాలు చోటు చేసుకొంటున్న విషయం తెలిసిందే. దొరవారిసత్రం మండలంలో అక్రమార్కులు మరో అడుగు ముందుకేసి ఒకే ఇంటిని ఇద్దరికి చూపించిన వైనం ఆశ్చర్య పరుస్తోంది. మండలంలో మూడు విడతలుగా 22 గ్రామ పంచాయితీల్లో ఇందిరమ్మ గృహనిర్మాణాలు చేపట్టారు. వీటిలో భారీ అవకతవకలు చోటుచేసుకొన్నాయి. ఇళ్లను నిర్మించే సమయంలో ఒకే ఇంటికి రెండు ముఖద్వారాలు నిర్మించి, పనులు పూర్తవగానే ఒకే ఇంట్లో ఇద్దరిని కాపురముండమని చూపించడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. బూదూరు గ్రామంలో ఇలాంటి సంఘటనలు ఎక్కువగా జరిగాయి. 20 ఇళ్లను నిర్మించాల్సి వుండగా 10 ఇళ్లనే నిర్మించి 20 కుటుంబాలను అక్కడ వుండమన్నారు. కట్టని గృహాలకు సైతం పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించిన సిబ్బంది, అర్హులకు మాత్రం బిల్లు చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తుండడంతో లబ్ధిదారులు వీటి కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా నెలల తరబడి తిరగాల్సి వస్తోంది.

శిథిలావస్థకు పంచాయితీ భవనం

పాపిరెడ్డిపాళెంలో దుస్థితి

తోటపల్లి గూడూరు మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామ పంచాయితీ భవనం శిథిలావస్థకు చేరుకొంది. శ్లాబ్ పెచ్చులూడిపోయి, చినుకుపడితే ఉరుస్తుండడంతో సిబ్బంది విధులు నిర్వహించాలంటేనే హడలిపోతున్నారు. 1970లో ఈ భవనాన్ని నిర్మించారు. ఆనాటి భవనం నేడు శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే స్థితికి వచ్చినా నూతనభవనాన్ని నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఎప్పుడు కూలుతుందోనని విక్కువిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సిబ్బంది పని చేస్తున్నారు.

మొసలి కలకలం

- చినక్రాక రిజర్వాయర్‌లో ఎలావచ్చి చేరిందో?

జలదంకి మండలంలోని చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో మొసలి వచ్చి చేరడంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సోమశిల జలాలను సంగం ఆనకట్ట వద్ద నుంచి కావలి కాలువకు విడుదల చేసినప్పుడు కాలువ ద్వారా మొసలి రిజర్వాయర్‌లోకి వచ్చి చేరింది. ఇది నీళ్ల కోసం అక్కడకు వెళ్లే బర్రెలను చంపితింటుండడంతో గ్రామస్తులు హడలిపోతున్నారు. సోమశిల సిబ్బంది ఒకరు మొసలి చేరిన విషయాన్ని అధికారులకు తెలపడంతో వారు చుట్టుప్రక్కల ప్రాంతాల వారిని రిజర్వాయర్‌లోకి దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. చినక్రాక గ్రామానికి చెందిన రైతులు తప్పిపోయిన పశువుల కోసం వెదుకులాడుతుండగా రిజర్వాయర్‌లో మొసలి బారినపడిన నగం తినివేసిన కళేబరాలు కన్పడ్డాయి. దీంతో రైతులు హడలిపోతున్నారు. సాధారణంగా రైతులు తూముల వద్ద చేరిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు నీళ్లలోకి దిగుతుంటారు. మొసలి విషయం తెలియడంతో గ్రామస్తులు రిజర్వాయర్ వైపు పోవాలంటేనే భయపడుతున్నారు.

ఎస్‌బిక్యూ ఉక్కు పరిశ్రమతో ఇబ్బందులు!

బూడిదను వెదజల్లుతోంది.

అంకులపాటూరులో ఏర్పాటైన ఎస్‌బిక్యూ ఉక్కు పరిశ్రమ వలన ప్రగతి ఎలా వున్నా ఆ ప్రాంతవాసులకు తిప్పలు తప్పడం లేదు. పరిశ్రమ స్థాపన సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా తగిన చర్యలు తీసుకొంటామని చెప్పిన యాజమాన్యం దాని గురించి పట్టించుకోకపోవడంతో ఇళ్లలోకి బూడిద వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విపరీతమైన దుమ్ము ధూళి, పొగ కారణంగా రోగాలబారిన పడుతున్నట్లు చెప్పున్నారు. వీటి వలన నీరు కలుషితం అవుతున్నదని వాటినే త్రాగడం వలన ఆస్పత్రుల పాలవుతున్నామని వాపోతున్నారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా ఫ్యాక్టరీ ఎదుట గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. బూడిద, బొగ్గుపొడి ఇళ్లలో నిండిపోతున్నదని తెలిపారు. పలుమార్లు ఈ సమస్యలను యజమాన్యానికి తెలిపినా పట్టించుకోవడం లేదని అధికారులు తగినచర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

పోలీసు కుటుంబాలకు చేయూతేది?

వెంకటగిరి బెటాలియన్‌లో మృతులకు అందని సాయం

విధి నిర్వహణలో తమ ప్రాణాలను అడ్డుపెట్టి అసువులు బాసిన పోలీసులకు నివాళులు అర్పించడం తప్ప వారి కుటుంబాలకు పూర్తిస్థాయిలో చేయూత అందడం లేదనేందుకు వెంకటగిరి బెటాలియన్ పోలీసుకుటుంబాలే ఉదాహరణ. 9వ బెటాలియన్‌కు చెందిన పోలీసులు 1994లో సాధారణ ఎన్నికల నిమిత్తం వరంగల్ జిల్లాకు వెళ్లారు. ఉరవకొండ వద్ద నక్సల్స్ అమర్చిన మందుపాతర పేలుళ్లలో 8మంది మరణించారు. ఎదురుకాల్పుల్లో మరో పోలీసు చనిపోయాడు. అమరవీరులు 9మందికి స్మారకచిహ్నం నిర్మించారు. పోలీసు అమరవీరుల దినం నాడు వీరికి అంజలి ఘటించడం మినహా వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి సహాయం అందకపోవడంతో కుటుంబానికి చేయూతగా నిల్చిన వారిని కోల్పోయిన కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాయి. పోలీసు పెద్దలు, పాలకులు తమ జీవితాలను ప్రజల కోసం త్యాగం చేసిన అమరులైన పోలీసుకుటుంబాలను ఆదుకొనే విషయంలో శ్రద్ధ చూపాలని పలువురు కోరుకొంటున్నారు.



నెల్లూరు రచయిత్రి సోమిరెడ్డి జమున స్మారక అవార్డు ప్రదాన సభలో నక్షత్ర పుస్తక రచయిత్రి డాక్టర్ జయప్రదను సన్మానిస్తున్న డాక్టర్ శ్రీనివాసులేఖ, పాతూరి అన్నపూర్ణ, ప్రతిమ తదితరులు.



నెల్లూరు టౌన్‌హాల్‌లో సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక నేతృత్వంలో జరిగిన శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొన్న నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి.



నెల్లూరు కస్తూరిబా కళాక్షేత్రంలో జరిగిన ముస్లిం యువతీ,యువకుల ఉచిత వివాహాల కార్యక్రమంలో పాల్గొని వరులకు ఖురాన్ ప్రతినందిస్తున్న మైనార్టీ మంత్రి అహ్మదుల్లా.

● పన్ను వసూళ్లలో

కావలి ఫస్ట్!

కావలి మున్సిపాలిటీ పన్ను వసూళ్లలో రాష్ట్రస్థాయిలో ప్రథమంగా నిలచింది. 2008-09 సంవత్సరానికి సంబంధించి 3కోట్ల 50 లక్షల రూపాయలను పన్ను క్రింద వసూలు చేసింది. సెకండ్‌గ్రేడ్ మున్సిపాలిటీల్లోకెల్లా కావలి రాష్ట్రంలోనే ప్రథమస్థానం సాధించింది. పన్నుల వసూళ్లలో మునిసిపల్ కమిషనర్ జెసి.పెంచలయ్య విన్నూత్న పద్ధతులను

ప్రాథమిక సౌకర్యాల కల్పనలో మాత్రం లాస్ట్


అవలంభించి ఈ ఘనత సాధించారు. బకాయిలున్న వారి ఇంటి ముందు డప్పు కొట్టించడం, పన్ను చెల్లించని దుకాణాలు, హోటళ్ల ముందు చెత్తకుండీలను పెట్టి నిరసన తెలపడం వంటి పద్ధతుల వల్ల పన్నులు బాగా వసూలయ్యాయి. మొత్తం మీద మొండి బాకీలు వసూలు చేయడంలో దిట్టనిపించుకొన్నాడు పెంచలయ్య. డప్పుకొట్టడంతో రికార్డు స్థాయిలో పన్నులు వసూలవుతున్నాయంటే డప్పుకు వున్న బలమేమిటో అర్థం చేసుకోవచ్చు. పన్ను వసూళ్లలో కావలి మునిసిపాలిటీ చేపట్టిన వినూత్న పద్ధతులను మిగతా మునిసిపాలిటీలు అమలుచేస్తే వాటికీ పన్నుల వసూళ్లు సక్రమంగా జరిగే అవకాశముంది.

● కండలేరు డ్యాం వద్ద వృథాగా టర్బైన్లు!

విద్యుత్‌ప్లాంట నిర్మించరా?

కోట్లరూపాయల వ్యయంతో నిర్మాణపనులు చేపట్టినా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కాకపోవడంతో అందుకోసం ఏర్పాటు చేసిన పరికరాలు నిరుపయోగంగా మారుతున్న వైనం కండలేరులో చోటుచేసుకొంది. డ్యాం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు 25కోట్ల రూపాయల ఖర్చుతో సిమెంట్ కాంక్రీట్ పనులు చేపట్టారు. ప్లాంట్ నిర్మాణం జరగకపోవడంతో పదేళ్ల నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే అవకాశం లేకుండా పోయింది. ఇప్పటి వరకు 20సార్లు కండలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేసినా పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టని కారణంగా విద్యుత్ ఉత్పత్తికాక వథకం నిరుపయోగం మారింది. భారీఖర్చుతో మూడు టర్బైన్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా తొమ్మిది మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం. రెండేళ్ల క్రిందట జెన్‌కో అధికారులు వీటిని పరిశీలించి త్వరితగతిన విద్యుత్ ఉత్పత్తి ప్రారంభిస్తామని చెప్పినా ఆ దిశగా పనులు జరగకపోవడంతో హెడ్‌రెగ్యులేటర్‌కు ఇరువైపులా ఏర్పాటు చేసిన టర్బైన్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

"మన టివి"లు మాయం!



విద్యార్థులకు మరింతగా విజ్ఞానాన్ని అందించేందుకు జిల్లావ్యాప్తంగా వున్న పాఠశాలలకు టివిలను అందజేశారు. మన టివి పేరుతో అందించిన వీటి ద్వారా నిర్ణీత సమయంలో విద్యార్థులకు వివిధ కార్యక్రమాలను ప్రసారం చేసేందుకు చర్యలు చేపట్టారు. మండల కార్యాలయాలలోనూ వీటిని ఏర్పాటు చేశారు.

ఎక్కడున్నాయో విచారించాల్సిందే!

2002 సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 150 కేంద్రాలలో టివిలను సరఫరా చేశారు. అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా వుంటుందని భావించి ప్రభుత్వం అందించిన టివిలు మూడురోజులకే మూలపడ్డాయి. లక్షల రూపాయలు వ్యయం చేసి ఏర్పాటుచేసిన టివీలు నిష్ప్రయోజనమయ్యి పలు పాఠశాలల్లో దుమ్ముకొట్టుకొని వుంటున్నాయి. కొన్ని చోట్ల ఈ టివిలు ఉపాధ్యాయులు, మండల విద్యాధికారుల ఇళ్లలోకి చేరుకొన్నట్లు సమాచారం. ఇప్పటికైనా టివిలు విద్యార్థులకు ఉపయోగపడేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుకొంటున్నారు.

ఏడేళ్లయినా ప్రారంభానికి నోచుకోని భవనం

క్రొత్త భవనాన్ని నిర్మించి ఏడేళ్ల గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం తోటపల్లి గూడూరు మండలం చిన్నచెరుకూరులో చోటు చేసుకొంది. దళితవాడలో 2002 సంవత్సరంలో ఎంపి నిధులు నాలుగు లక్షల రూపాయలు వెచ్చించి కమ్యూనిటీ హాలును నిర్మించారు. అప్పటి తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో 16వ విడత

దళితవాడలో కమ్యూనిటీహాలు అంటే చులకనా?

జన్మభూమి కార్యక్రమం సందర్భంగా ఆనాడు మంత్రిగా వుండిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దీనికి శంకుస్థాపన చేశారు. తర్వాత భవనం పూర్తయినా ప్రభుత్వం మారడంతో ఆనాటి నుంచి నేటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. నేడు ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గ్రామానికి చెందిన కొందరు ధాన్యాన్ని నిల్వ చేసుకొనే గోదాముగా మార్చుకొని వాడుకొంటున్నారు. నిర్మించి ఏడేళ్లయినా ప్రారంభించి ప్రజల వినియోగంలోకి తీవాల్సిన బాధ్యత అధికారులకు లేదా?


బుచ్చి - ముంబాయి రోడ్డులో నడవని ట్రాఫిక్

సింగిల్ లైన్ వంతెనలతో ఇబ్బంది

సంగం మండలంలో రోడ్డు డబుల్‌లైను వేసినా సింగిల్‌లైన్ వంతెనల కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. ముంబాయి జాతీయరహదారిపై పలుచోట్ల ఈ సింగిల్‌లైన్ వంతెనలు వున్నాయి. 15కిలోమీటర్ల దూరంలో వున్న సంగం-బుచ్చి మధ్య ఆరు వంతెనలు వున్నాయి. సంగం సమీపంలో కావలి, దువ్వూరు, కనిగిరి ప్రధాన కాలువలపైన, బ్రాంచ్ కాలువపైన ఈ సింగిల్ వంతెనలు నిర్మితమై వున్నాయి. వేగంగా వచ్చే వాహనాలు ఈ వంతెనల వద్ద తరచూ ప్రమాదాలకు గురౌతున్నాయి. వీటి వలన వంతెన రక్షణగోడలు దెబ్బతిని మరింతగా ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. దెబ్బతిన్న వంతెనల రక్షణ గోడల నిర్మాణానికి ఏటా లక్షలరూపాయలు ఖర్చుపెడుతున్నా వృధా అవుతున్నాయి. ఇవి కేవలం కాంట్రాక్టర్లకు జేబులు నింపుకోవడానికి తప్ప నాణ్యత లేకుండా పోతుండడంతో తరచూ కూలిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు వీటిని పటిష్టవరచేందుకు చర్యలు చేపట్టాల్సి వుంది.

నీటి యాజమాన్యంతో అధిక దిగుబడి!

పంటల సాగులో తగినవిధంగా నీటిని వినియోగించినట్లయితే అధిక దిగుబడిని సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. వరి పంటతోపాటు వేరుశనగ, మొక్కజొన్న, చెరకు, మిర్చి, పత్తి పంట ఎదుగుదలకు నీరు అవసరం. కాబట్టి తగిన మోతాదులో నీటిని వినియోగించుకోవాలని సూచించారు. సాగు చేస్తున్న పంటతోపాటు నేలస్వభావం, వాతావరణ పరిస్థితులు, పంటవండిచే తీరుపై నీటి అవసరం ఆధారపడి వుంటుందన్నారు. ముఖ్యంగా పంట కీలక దశలను గమనించుకొని నీటిని వాడుకోవాలన్నారు. ఒక్క పంటకు ఒక్కోస్థాయిలో నీటిని అందించాల్సి వుంటుందని తెలిపారు. నీటి ఎద్దడి వలన పంట దిగుబడులు తగ్గుతాయి కనుక సున్నితమైన, కీలకమైన దశలలో తగిన పరిమాణంలో నీరు అందించి నీటి ఎద్దడికి పంట గురికాకుండా చూడాలన్నారు.



'రోజా' విలాపం



సినీనటి రోజా రెంటికి చెడ్డ రేవడైంది. తెలుగుదేశం పార్టీలో మహిళావిభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఒక వెలుగు వెలిగిన రోజా ఆ తర్వాత రాజీనామా చేసి కాంగ్రెస్‌లోకి ఫిరాయిందాలనుకుంది. ఈ మేరకు అప్పటి సిఎం వైఎస్. రోజాకు అభయహస్తం అందించారు కూడా. అయితే ఇంతలోనే వైఎస్ హెలికాప్టర్ ప్రమాదం జరగటంతో 'రోజా' సీన్ మారింది. కాంగ్రెస్‌లో చేరడానికి ఆమెకు ఎవరూ చేయూత అందించడం లేదు. ఒకటి రెండుసార్లు జగన్‌ను కలిసినా ఎందుకో రోజా కాంగ్రెస్‌లో చేరలేదు. ఈలోగా తెలుగుదేశంలో తనకు బాగా సాన్నిహిత్యమున్న వారితో చంద్రబాబుకు కబురు పెట్టిందట. అయిందేదో అయిపోయింది తప్పుజరిగిపోయింది. మీరు కనికరిస్తే తిరిగి పార్టీలో చేరతానందట. అయితే ఆ వైపు నుంచి ఎటువంటి సుందన రాలేదట. ఇక చేసేదేముందంటూ సినిమాల్లో వేషాలకోసం ప్రయత్నిస్తోంది. సో... సినిమాల్లో సెకండ్ ఇన్నింగ్స్ అయినా రోజాకు కలిసొస్తుందో లేదో?

జగన్ 'కోడా'



జార్ఖండ్‌లో నాలుగువేల కోట్ల రూపాయల్ని వెనకేసుకున్న ఆ రాష్ట్ర మాజీ సిఎం మధుకోడాతో పోటీపడగల నాయకులు రాష్ట్ర కాంగ్రెస్‌లో చాలా మందే వున్నారంటూ తెలుగుదేశం ప్రచారాన్ని చేపట్టింది. వై.ఎస్. తనయుడు ఇప్పటికే లక్ష 20వేల కోట్లకు పడగెత్తాడంటూ చంద్రబాబు ఆరోపణల పల్లకిని అందుకున్నాడు. ఈ మధ్య జరిగిన విలేకరుల సమావేశంలో ఓ కొంటివిలేకరి అడిగిన ప్రశ్నకు చంద్రబాబు అత్యుత్సాహం చూపి జార్ఖండ్‌కు మధుకోడా. మనకు 'జగన్ కోడా' వున్నారంటూ వ్యాఖ్యానించాడట. పనిలో పనిగా మధుకోడాతోపాటు జగన్ అక్రమసంపాదన, ఆస్తులపై కూడా విచారణ జరిపించాల్సిందిగా డిమాండ్ చేశాడు.

కాంగ్రెస్‌కు రెబల్స్ పోరు



హైదరాబాదు నగర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తిరుగుబాటు అభ్యర్థులతో తల బొప్పి కడుతోంది. నగరంలో 150 స్థానాలకుగాను కాంగ్రెస్ అధికార అభ్యర్థుల్ని ప్రకటిస్తే యిందులో సగానికిపైగా స్థానాల్లో తిరుగుబాటు అభ్యర్థులు రంగంలో వున్నారు. టిక్కెట్ల కేటాయింపులో ఎమ్మెల్యేల మద్దతుదార్లకు కాకుండా పార్టీ నగరశాఖ అధ్యక్షుడు దానం నాగేందర్ తన సొంత మనుషులకు టిక్కెట్లు ఇప్పించుకోవడమే 'రెబల్స్'కు కారణం. అలాగే కొందరు నగర ఎమ్మెల్యేలు పార్టీ కార్యకర్తల్ని కాదని తమ సొంత వారికి టిక్కెట్లు యిప్పించుకోవడం కూడా రెబల్స్‌కు మరో కారణంగా వుంది. మొత్తం మీద పార్టీలో పనిచేసిన వారిని పక్కనపెట్టి దళ్ళిచ్చిన వాళ్లకే టిక్కెట్లు యిచ్చారన్నది కాంగ్రెస్ కార్యకర్తల ప్రధాన ఆరోపణ. ఏది ఎలావున్నా ఈ ఎన్నికల్లో రెబల్స్ అభ్యర్థులు కాంగ్రెస్ విజయావకాశాలకు సవాలుగా మారారన్నది నిజం.

కొత్త మంత్రివర్గానికి మరికొంతకాలం




రాష్ట్రంలో కొత్త మంత్రివర్గం ఏర్పాటు మరికొంతకాలం ఆలస్యమయ్యే అవకాశం వుంది. హైదరాబాదు నగరపాలక ఎన్నికలు రావడంతో మంత్రివర్గం మార్పులు, చేర్పులకు బ్రేక్ పడింది. రాజధాని నగరం నుంచి ప్రస్తుతం దానం నాగేందర్, ముఫేష్ గౌడ్ మంత్రులుగా వున్నారు. ఇందులో దానం నాగేందర్ వ్యవహారశైలి రోశయ్యకు నచ్చడం లేదు. జగన్ వీరాభిమానిగా ముద్ర వున్న నాగేందర్‌ను వదిలించుకోవాలని రోశయ్య భావిస్తున్నారట. నగరపాలక ఎన్నికల్లో కూడా టిక్కెట్ల కేటాయింపులో హస్తలాఘవం చూపి పార్టీని యిబ్బందిపెడ్తున్నాడు నాగేందర్. ఈ ఎన్నికల్లో పార్టీ పరాజయం చెందితే రోశయ్య నాయకత్వంపై బురద చల్లవచ్చన్నది జగన్ మద్దతుదారుల వ్యూహంగా వుంది. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల తర్వాతనే కాగల కార్యాన్ని నెరవేర్చాలని రోశయ్య ఎదురుచూస్తున్నాడట.

కామ్రేడ్ల బేజారు!



హైదరాబాదు నగరపాలక ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టుపార్టీల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. తెలుగుదేశంతో కామ్రేడ్లు అధికారికంగా పొత్తుపెట్టుకున్నప్పటికీ ఆ పార్టీ తిరుగుబాటు అభ్యర్థులు రంగంలో వుండటంతో ఏంచేయాలో అర్థంగాక కమ్యూనిస్టులు తలపట్టుకుంటున్నారు. పొత్తులో భాగంగా తెలుగుదేశం ఉభయ కమ్యూనిస్టులకు తలా మూడుస్థానాల్ని విదిలించింది. కనీసం ఈ మూడు స్థానాల్లో అయినా గెలిచి నగర కార్పొరేషన్‌లో ఉనికిని చాటుకుందామనుకున్నారు కామ్రేడ్లు. అయితే ఇందులో ఒక స్థానంలో ఉభయకమ్యూనిస్టులు తలపడుతున్నారు. వీరికి తోడు తెలుగుదేశం రెబల్ అభ్యర్థి విజయావకాశాల్ని దెబ్బ తీస్తున్నాడట. ప్రస్తుతం చంద్రబాబును తిట్టుకుంటూ కామ్రేడ్లు ఎన్నికల బరిలో చావో రేవో అన్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు.

లేటు వయసులో 'దగ్గుబాటి' ఘాటుప్రేమ



ఎన్టీరామారావు పెద్దల్లుడు డాక్టర్ దగ్గుపాటి వెంకటేశ్వరరావుకు లేటు వయసులో ఘాటు ప్రేమ మొదలైందట. తనకు పెళ్లయి మూడుపదులు దాటిన తర్వాత గానీ భార్య పురంధరేశ్వరిపై నిజమైన ప్రేమ మొదలు కాలేదట. పెళ్లయిన కొత్తలో ఫ్యూడల్ భావాలతో వున్న తమ కుటుంబంలో పురుషాధిక్యత వుండేదని, దానివల్ల పురంధరేశ్వరిపై సరిగా ప్రేమ దృష్టి పెట్టలేకపోయినట్లు డాక్టర్ సాబ్ ఓ టీవీ ఛానల్‌కు యిచ్చిన ఇంటర్వ్యూలో ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే ఇప్పుడు పిల్లలంతా సెటిల్ అయ్యాక భార్యపై ప్రేమ చిగురించిందట. ప్రస్తుతం కేంద్రంలో మంత్రిగా వున్న పురంధరేశ్వరికి భవిష్యత్తులో రాష్ట్ర ముఖ్యమంత్రిగా అవకాశం వస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో కూడా వదులుకోబోమంటున్నాడు ఈ లేటు వయసు భార్యా ప్రేమికుడు.

దేశం గెలుపుకు చిదాత్మనంద చిటుకులు



హైదరాబాదు నగర ఎన్నికల్లో గెలుపుకోసం తెలుగుదేశంపార్టీ స్వామిచిదాత్మానంద చిటుకుల్ని ఉపయోగించుకుంటోంది. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో నగరంలో చతికిలబడిన తెలుగుదేశం ఈసారి ఎలాగైనా నగర మేయర్ కుర్చీని కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో ఉంది. దీని కోసం ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు రకరకాల వ్యూహాలను అనుసరిస్తున్నాడు. ఇందులోభాగంగా నగర ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు, నాయకులకు ఒకరోజు రాజకీయశిక్షణను నిర్వహించాడు. శిక్షణలో భాగంగా 'ఎలా గెలవాలి? అన్న అంశంపై స్వామి చిదాత్మానంద కొన్ని చిటుకుల్ని చెప్పాడు. ఎన్నికలయ్యే వరకు ప్రతిరోజూ అభ్యర్థులకు యిలాగే విజయరహస్యాల్ని బోధించే కార్యక్రమం వుంటుందట. ఇలా అభ్యర్థుల మైండ్‌సెట్‌పై దృష్టి పెట్టేకంటే ఓటర్లను ప్రభావితం చేసే అంశాలకు ప్రాధాన్యత యిస్తే బాగుంటుందని కొందరు 'దేశం' నాయకులు గొణుక్కొంటున్నారట.

తాతయ్యకు టానిక్కు



ఢిల్లీకి వెళ్లి వచ్చిన దగ్గర నుంచి సిఎం రోశయ్యలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఇప్పట్లో సిఎంను మార్చేది లేదని సోనియాగాంధీ తెగేసి చెప్పటమే ఇందుకు కారణమంటున్నారు. ఢిల్లీకి వెళ్లే ముందు రోశయ్యకు, ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన రోశయ్యకు మధ్య ఎంతో అంతరం కనిపిస్తోందట. ఢిల్లీలో రోశయ్య ప్రాధాన్యం పెరగడంతో కెవిపి కూడా వెనక్కు తగ్గాడు. రోశయ్య ఢిల్లీలో వున్న సమయంలో కెవిపి కూడా అక్కడేవున్నాడు. అయితే రోశయ్యను కలసిన దాఖలాలు లేవు. తిరిగి వచ్చాక కూడా కెవిపి సిఎంకు దూరంగా వుంటున్నాడు. తాతయ్య (రోశయ్య)కు సోనియా పట్టించిన టానిక్ బాగా పనిచేస్తోందని జగన్ వ్యతిరేక శిబిరం అంటోంది. దివాకర్‌రెడ్డి అయితే మరో అడుగు ముందుకేసి ఢిల్లీ వెళ్లి వచ్చాక రాష్ట్రంలో రోశయ్య పాలన వెలిగిపోతోందంటూ ప్రచారం చేస్తున్నాడు.

నవగ్రహ పూజలతో ఒడిదుడుకుల నుంచి విముక్తి!



గ్రహాల ప్రభావం ప్రతి మనిషిపై ఎంతో కొంత వుంటుంది. శిశువులుగా గర్భంలో వున్న నాటి నుంచి ప్రతి దశలోనూ గ్రహాల ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంటుంది. గ్రహస్థితి బాగుంటే మనిషి జీవితం హాయిగా సాఫీగా జరిగిపోవడం, గ్రహస్థితి బాగాలేనప్పుడు ఒడిదుడుకులు ఎదురౌతుంటాయనేది వలువురి నమ్మకం. జ్యోతిషశాస్త్రం ఈ విషయాలను ధృవీకరిస్తుంది. ఈ శాస్త్రానికి హేతుబద్ధత వుందా? లేదా అనే అంశాన్ని ప్రక్కనబెడితే మనుషులపై గ్రహాల ప్రభావం అనేది తప్పకుండా వుంటుందనేది పలువురు వ్యక్తపరుస్తున్న అభిప్రాయం. భగవంతునికి పూజలు చేయడంతోపాటు జాతక చక్రాన్ని అనుసరించి శాంతి పూజలు చేయించుకోవడం పరిపాటి. ఆయా గ్రహాలను శాంతపరచి చికాకులు, ఒడిదుడుకుల నుంచి విముక్తి పొందేందుకు చేసే వివిధ పూజల్లో నవగ్రహపూజలు ప్రధానమైనవి. సూర్యచంద్రులు, కుజుడు, బుధుడు, గురువు, శుక్రుడు, శని, రాహుకేతువులు నవగ్రహాలు. ఆయా వ్యక్తుల గ్రహఫలితాలను బట్టి ఏ గ్రహాల వల్ల ఆటంకాలు ఎదురౌతున్నాయో తెలుసుకొని వాటికి శాంతిపూజలు చేయించుకోవడం ఈ నవగ్రహ పూజల ఉద్దేశ్యం. సూర్యునికి ఆదివారం, చంద్రునికి సోమవారం, కుజునికి మంగళవారం, బుధునికి బుధవారం, గురువుకు గురువారం, శుక్రునికి శుక్రవారం, శనికి శనివారం, రాహుకేతువులకు ఆదివారం ప్రీతికరమైన రోజులు. నవగ్రహాల్లో శని, గురువుల ప్రభావం మనుషులపై అధికంగా వుంటుంది. నవగ్రహాలకు వాటి ప్రీతినిబట్టి అభిషేకాలు, దానాలు, హోమాలు చేస్తారు. సూర్యునికి గోధుమలు, చంద్రునికి బియ్యం, కుజునికి కందులు, బుధగ్రహానికి పెసలు, గురువుకు శనగలు, శుక్రునికి అలసందులు, శనికి నువ్వులు, రాహువుకు మినుములు, కేతువుకు ఉలవలతో పూజ చేస్తారు.

హోమాలకు సంబంధించి సూర్యునికి జిల్లేడు సమిధలతోను, చంద్రునికి ఉత్తరేణి, గురువు (బృహస్పతి)కి రావి, శుక్రునికి అత్తి, శనికి జమ్మి, రాహువుకు గరిక, కేతువుకు దర్భసమిధలతో హోమం చేస్తారు. హోమాలు, దానాలతోపాటు అయా గ్రహాలకు సంబంధించిన మూలమంత్రాన్ని పఠిస్తూ ఒక్కోగ్రహానికి వేల సంఖ్యలో జపాలు చేయాల్సి వుంటుందని పండితులు చెప్తున్నారు. నగరంలోని అన్ని దేవాలయాల్లో నవగ్రహాలు ప్రతిష్ఠించి వుండడంతో వాటిలో నిత్యం ఈ నవగ్రహ పూజలు జరుగుతుంటాయి.

ట్రంకురోడ్డు కబుర్లు

నిఖాల్లో నిరసనలు



తిరుమల తిరుపతి దేవస్థానం చేస్తున్న కళ్యాణమస్తును మైనార్టీశాఖ కాపీ చేసి పేద ముస్లిం యువతులకు నిఖాలు చేయిస్తున్న విషయం తెలిసిందే. గత వారం నెల్లూరులో జరిగిన ఈ నిఖాలకు మైనార్టీ మంత్రి అహ్మదుల్లా సహజమైన తన అలవాటు ప్రకారం చీకటిపడి వచ్చారు. మధ్యాహ్నం నుంచి ఈ కార్యక్రమం ఎప్పుడు జరుగుతుందా అని వధూవరుల కళ్లుకాయలు కాచేలా చేశారాయన. ఇది చాలదన్నట్లు ఇక్కడ నిఖాలు చేసుకొంటే 35వేల రూపాయల బంపర్ ఆఫర్‌గా జహేజ్ (కొత్త కాపురానికి అవసరమైన సామగ్రి) వస్తుందని ప్రచారం చేసిన బ్రోకర్లు ఆశావహుల వద్ద రెండువేల రూపాయల చొప్పున నొక్కేసి ఏదో ఒక నెంబర్ వేసి టోకన్లు ఇచ్చారట. బ్రోకర్లు ఇచ్చిన టోకన్లు చెల్లవని మైనార్టీ శాఖాధికారులు చెప్పడంతో పెళ్లిచేసుకొందామని ఇక్కడకు వచ్చిన ముస్లిం యువతీయువకులు కార్యక్రమ నిర్వాహకులను శాపనార్థాలు పెట్టారు. నాశనమైపోతారని మెటికలు విరిచారు. ఈ విషయం చివరన మంత్రి అహ్మదుల్లా చెవిన పడడంతో అరే భాయ్... అల్లా చేసిన పెళ్లిళ్లకు దిష్టిపోయిందని తెలివిగా చమత్కరించారు.

సిఎం కటౌట్ కాల్చిన కేసు సుఖాంతం



రాష్ట్రంలో తొలిసారిగా ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య కటౌట్‌ను కావలి పట్టణంలో పెద్ద సంఖ్యలో వుండే ఆర్యవైశ్య సోదరులు ముచ్చటపడి ఏర్పాటు చేశారు. నవంబర్ 1తేది పెట్టిన ఈ కటౌట్‌కు ఆ రాత్రి కొంత కాలిపోయింది. కావలిలోని మూడు కాంగ్రెస్ గ్రూపులకు ఒకరంటే మరొకరికి పడదు. కాల్చిన విషయమై ఒకరిపై మరొకరు ఆరోపణలు, కేసుల వరకు వెళ్లారు. సిఎం కటౌట్‌కు నిప్పు పెట్టిన వ్యవహారం ముదరడంతో కావలి సిఐ కాస్త లోతు దర్యాప్తు చేశాడు. చివరికి తేలిందేమంటే రాత్రుళ్లు ఫ్లెక్సీ బోర్డుల ఆసరాగా పడుకొనే అమాయకుడొకరు కావలిలో విపరీతంగా వుండే దోమల బాధ భరించలేక మస్కిటో కాయిల్ పెట్టుకొన్నాడట. ఈ కాయిల్ ఫ్లెక్సీకు కట్టిన తాళ్లకు నిప్పును రాజేసింది. రాజకీయులు దీన్ని రావణకాష్ఠం చేయచూసినా పోలీసులు కష్టపడి దాన్ని ఆర్పివేసి పెద్ద ప్రమాదాన్ని తప్పించారు.

ఆయన 'తోక'



ఈ శాన్య ఋతుపవనపు వర్షం మాదిరి చాలారోజులకు ప్రజారాజ్యం పార్టీ నాయకుడు ఆనం వెంకటరమణారెడ్డి ఈవారంలో నెల్లూరుకు వచ్చారు. వర్షబాధితులను పరామర్శించి జేబులోని ఐదువందల రూపాయల నోట్లు వారికిచ్చి సంతృప్తిపర్చారు. పనిలో పనిగా బాబాయ్‌లు ఆనం వివేకానందరెడ్డి, రామనారాయణరెడ్డిల దురాగతాలు మీడియా ముందు ఎలుగెత్తి చాటారు. పెద్ద బాబాయ్‌ను అసలాయన మగాడేనా అంటూ ధైర్యంగా ప్రశ్నించారు. ఇంతలో ఓ విలేకరి లేచి మీ పార్టీ తరపున నగర ఎమ్మెల్యేగా గెల్చిన ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి వివేకా వెనుక ఎందుకు తిరుగుతున్నారంటే ఏ మాత్రం తొట్రుపడకుండా ఆయన వెనుక మా ఎమ్మెల్యే తిరగడం లేదు. మా ఎమ్మెల్యేకు తోకలా వివేకానందరెడ్డి నగరంలో పర్యటిస్తున్నారు. ఈ పని ఆయన స్వంత నియోజకవర్గం నెల్లూరు రూరల్‌లో చేస్తే బాగుంటుందని ఉచితసలహా కూడా ఇచ్చాడు వెంకటరమణారెడ్డి.

కుక్కల పురి



సింహపురిగా గతంలో పేరుగాంచిన నగరంలో ప్రస్తుతం గుక్కల సంచారం ఎక్కువై కుక్కలపురిగా పేర్కొనాల్సి వస్తోంది. నెల్లూరు నగరంలో 2002వ సంవత్సరం నుంచి వీధికుక్కలను కార్పొరేషన్ పట్టకుండా ఫౌండేషన్ ఫర్ యానిమల్స్ సంస్థ కోర్టు నుంచి స్టే తేవడంతో కైరవుల సంతానం బాగా అభివృద్ధి చెందింది. ఐదు లక్షల మంది జనాభా కలిగిన నగరంలో యాభై వేలకుపైగా కైరవులు ప్రస్తుతం సంచరిస్తున్నారని ఒక అంచనా. ఇటీవలే వెల్లిన చిత్తకార్తెలోనూ వీరు తమ సంతానాభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశారు. కుక్కలు జనాన్ని విపరీతంగా కరిచిపెడుతున్నాయి. నగరంలో కుక్కకాటు నిరోధక వ్యాక్సిన్‌కు కూడా కటకటలాడాల్సి వస్తోంది. కుక్కల నిర్మూలనకు మూగజీవుల సంఘాలు ఒప్పుకోవు. మరేదైనా ప్రత్యామ్నాయానికి కార్పొరేషన్ పాలకులు ఆలోచించరు. వెరసి నెల్లూరీయులకు కుక్క పాట్లు తప్పడం లేదు.

నాన్న చెప్పలేదు



ప్రక్కపక్క గ్రామాలవారైనా జిల్లాలో అనాదిగా నేదురుమల్లి, నల్లపరెడ్డి కుటుంబీకులకు పడదు. నేదురుమల్లి జనార్దనరెడ్డితో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చనిపోయేవరకు శత్రుత్వాన్నే కొనసాగించారు. ఈ మధ్య ఉత్తర కుమారునిగా మారిన శీనయ్య కుమారుడు, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డికి రోశయ్య సిఎం కావడంతో జిల్లాలో తన రాజకీయ మనుగడ సాగించను నేదురుమల్లి జనార్దనరెడ్డిని కలవక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీన్ని ఎవరూ తప్పుపట్టకూడదు గదా? అందుకే తెలివిగా స్వగ్రామం కోటలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి పెద్దాయన ఆశీర్వాదం తీసుకోను ఆయన వద్దకు పోతున్నానన్నారు. దీనికి అవాక్కైన పాత్రికేయులు ఇదేం ట్విస్ట్ సార్ అంటే మా నాయన ఆయన్ను కలవవద్దని చెప్పలేదని అమాయకంగా ముఖంపెట్టి మరీ చెప్పారాయన. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులుండరని పెద్దలు వూరకే చెప్పారా?

వారఫలాలు

తేది 14-11-2009 నుండి 20-11-2009 వరకు తుల, వృశ్చికాలలో రవి; తులలో శుక్రుడు; కన్యలో శని; వృశ్చికంలో బుధుడు; కర్కాటకంలో కుజుడు; మకరంలో గురువు; ధనుస్సులో రాహువు; మిథునంలో కేతువు; కన్య, తుల, వృశ్చిక, ధనుస్సులలో చంద్రుడు సంచరిస్తారు.

మేషం

కష్టసుఖాలు సమానంగా చోటు చేసుకొంటాయి. ఊహించని రీతిలో ధనవ్యయం అవుతుంది. ఆరోగ్యవిషయంలో జాగ్రత్త. ఎంత పొదుపు చేయాలనుకున్నా వీలుకాదు. సోదరులమూలంగా కూడ ఖర్చు అవవచ్చు. బంధుమిత్రుల సహాయసహకారాలు అందుతాయి. గృహనిర్మాణం లేదా వసతి గృహాన్ని అమ్మడం అనే పనులలో నిమగ్నమవుతారు. శనిని, ఆంజనేయుని తప్పక కొలవాలి.

వృషభం

ప్రయాణాలలో సత్ఫలితాలు ఎదురుచూడవచ్చు. చిన్న చిన్న సమస్యలు ఎదురవుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వస్త్రాభరణాలు కొంటారు. నోటికి సంబంధించిన అనారోగ్య బాధలుంటాయి. విదేశప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. గృహనిర్మాణకార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. మిత్రులు సాయమందిస్తారు. కుటుంబంలో సమస్యలు తీరుతాయి.

మిథునం

ఆరోగ్యవిషయంలో శ్రద్ధ అవసరం. మిత్రులమూలంగా మేలు. ధనవిషయాలలో లోటు లేదు. వివిధమార్గాలలో ధనప్రాప్తి అవకాశాలు. ఆగిన పనులు నిదానంగా సాగుతాయి. ఇతరులతో అభిప్రాయభేదాలు రావచ్చు. శుభకార్యాచరణకు శ్రీకారం చుడతారు. మాట నిలబెట్టుకోవడానికి శ్రమపడతారు. రాజకీయులకు ఉత్తమకాలం. వ్యాపారులకు మంచి లాభావకాశాలు.

కర్కాటకం

తలకు గాయాలు తగిలే అవకాశాలెక్కువ. జాగ్రత్త. ధనవిషయంలో కూడ కటకట ఉండవచ్చు. సోదరులతో అభిప్రాయభేధావకాశాలు. పనులు నిదానంగా సాగవచ్చు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి చేయడం మంచిది. వ్యాపారులకు గడచిన వారంలో ఏర్పడ్డ నష్టాలను ఈ వారంలో పూడ్చుకో వీలవుతుంది. అప్పులు తీరుస్తారు. విద్యార్థులకు ఒకవిధంగా చదువు సాగుతుంది.

సింహం

ఆరోగ్యవిషయంలో పెద్దగా చెప్పుకోతగ్గవేమీ లేదు. అయినా పాదాలకు సంబంధించిన బాధలుంటాయి. సాధారణంగా గడచిపోతుంది. ఆర్థికవిషయాలు చక్కగా ఉన్నాయి. నూతన వస్త్రాభరణాలు కొంటారు. తండ్రి, తండ్రివంటివారికి ఇబ్బందులుండవచ్చు. శ్వేతప్రదరం బాధించవచ్చు. గృహాలంకరణ విషయాలలో ఆసక్తి చూపుతారు. ఖర్చుకు వెరవరు. ప్రతి పనిలో దూకుడు అధికం.

కన్య

గడచినకాలం కన్నా మేలైన కాలం. విరోధులు తగ్గుముఖం పడతారు. పద్ధతి ప్రకారం పనులు నిర్వహిస్తారు. ప్రయాణాలు సుముఖంగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు మీకు అనుకూలంగా ఉంటాయి. ఇన్నినాళ్ళు ఆటంకాలతో అడ్డువడ్డ పనులు ఊపందుకొంటాయి. నూతనఉద్యోగావకాశాలు లభించవచ్చు. భూభవనాల ద్వారా ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

పంచాంగం

14 నెహ్రూ జయంతి.

శుభముహూర్తాలు లేవు.

నవంబరు తిథులు
కార్తీక బహుళ

14 శని	త్రయోదశి	రా.1.10	గం.ల.వ
15 ఆది	చతుర్దశి	రా.12.43	గం.ల.వ
16 సోమ	అమావాస్య	రా.12.38	గం.ల.వ

మార్గశిర శుద్ధ

17 మంగళ	పాడ్యమి	రా.1.07	గం.ల.వ
18 బుధ	విదియ	రా.12.09	గం.ల.వ
19 గురు	తదియ	తె.3.47	గం.ల.వ
20 శుక్ర	చవితి	తె.5.47	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com

తుల

అధిక ఖర్చులు మనసును కుంగతీస్తాయి. దూరప్రయాణావకాశాలు. దైవ కార్యాలలో ఎక్కువగా పాలు పంచుకోవాలి. వ్యాపారులకు లాభాలలో కొంత కోత ఏర్పడవచ్చు. నిదానంగా ఖాతాదారుల మనసెరిగి నడచుకోవడం మంచిది. భాగస్వాములతో గొడవలు రాకుండా చూసుకోవాలి. రాజకీయులు లేనిపోని గొడవల్లో చిక్కుకొంటారు. ఉద్యోగులకు శ్రమ అధికం.

వృశ్చికం

చాలా ప్రోత్సాహకరమైన కాలం. నోటికి సంబంధించిన ఇబ్బందులుండవచ్చు. ప్రయాణాలలో జాగ్రత్త. అనుకొన్న పనులు అనుకొన్నరీతిలో సాగుతాయి. సంతానమూలంగా సుఖశాంతులు లభిస్తాయి. వారి విద్యారంగం ప్రోత్సాహకరంగా ఉంటుంది. ధన విషయంలో లోటు ఉండదు. భవిష్యత్తుకు మంచి పథకాలు వేస్తారు. పురోభివృద్ధి అన్ని రంగాలలో ఉంటుంది.

ధనస్సు

బౌరసంబంధాలు చక్కగా ఉండవు. జీవితభాగస్వామి బంధువులతో గొడవలుండవచ్చు. నోరు పారేసుకోకుండడం మంచిది. ప్రతి పని నిలిచి నిదానంగా చేయడం మంచిది. వృత్తిలో మార్పు చేర్పులుండవచ్చు. భాగస్వాములతో జాగ్రత్త. వ్యాపారులకు కొంతవరకు మేలు. దైనందిన కార్యక్రమాలలో ఆటంకాలుండవచ్చు. విద్యార్థులకు ఒకమోస్తరుగా చదువు సాగుతుంది. కళాకారులకు ఆశాభంగం.

మకరం

అనుకొన్నవనులన్నీ అనుకొన్నరీతిలో ప్రణాళికాబద్ధంగా జరువుకొంటూపోతారు. ఉద్యోగవృద్ధి, వేతనవృద్ధి ఉంటుంది. ఇంతవరకు ఉంటూవచ్చిన ఇబ్బందులు తొలగుతాయి. చిరకాలంగా ఎదురు చూస్తూవచ్చిన శుభఫలితాలు అనుభూతిలోనికి వస్తాయి. శత్రువులు లొంగి నడచుకొంటారు. మాతృసంబంధీకులకు సాయమందిస్తారు. కుజుని కొలవాలి. ఆరోగ్యవిషయంలో జాగ్రత్త.

కుంభం

వృథా ఖర్చులు తయారుగా ఉంటాయి. ప్రతి అడుగు అచితూచి వేయడం మంచిది. అనవసరపు విషయాలలో జోక్యం చేసుకోకుండడం మంచిది. ఆర్థికవిషయాలు కొంత తృప్తికరంగా ఉంటాయి. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. కఠినంగా మాట్లాడవద్దు. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పైవారిని విమర్శించకుండాలి.

మీనం

నరాలకు సంబంధించిన బాధలధికం. గాయాలు తగులవచ్చు. ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. ముందుచూపుతో అడుగేయాలి. సంతానమూలంగా ఇబ్బందులుండవచ్చు. కోరివా సలహా లివ్వవద్దు. గుట్టుగా కాలం గడపడం మంచిది. ఆర్థిక విషయాలు అంతంతమాత్రమే. వ్యాపారులు ఖాతాదారులతో జాగ్రత్తగా మెలగాలి. రాజకీయులకు తీరని వేదన చోటుచేసుకొంటుంది.

బ్లాకు స్థలాలు దృష్టి దోషాలకు నిలయాలు!

కె.పెంచలరెడ్డి కర్నూలు

★ ఈశాన్యం బ్లాకు మక్కువతోకొన్నాను. అక్కడ యిల్లు కట్టలేకపోతున్నా, అమ్మలేకపోతున్నా?

బ్లాకు స్థలాలు దృష్టి దోషాలకు నిలయాలు. తూర్పు రోడ్డు రైల్వేగోడకు తగిలి ఆగింది. ఉత్తరం రోడ్డు కావలసినన్ని వీధి పోటున్నాయి. ఆ స్థలం పరిస్థితి అంతే. యంత్ర ప్రతిష్ట చేసి చూడండి.

వి.పవిత్ర నారాయణరెడ్డిపేట

★ బస్సులో వెళ్తూ చూశా, చాలా ఫ్యాక్టరీల్లో ఈశాన్యాల్లో దేవాలయాలు నిర్మించారు.

ఫ్యాక్టరీల్లో ఇతరత్రా నిర్మాణాల్లో ఈశాన్యం శంఖుస్థాపన జరిగిన ప్రాంతాల్లోనే దేవాలయం, లేదా దేవుడి గది నిర్మాణం జరగాలి. కాంపౌండ్‌లో దేవుడి ఆలయం నిషిద్ధం.

కె.పైడినాయుడు శ్రీకాకుళం

★ భారతదేశ వాస్తులో త్రివిధ మహర్షుల గురించి 'జ్యోస్సిద్ధాంతి'లో చెప్పారు. వీరి శాస్త్రాల్లో విరుద్ధ అంశాలు లేవా?

వశిష్ఠ, మయ, అగస్త్య వాస్తు శాస్త్రాల్లో ఏ అంశాల్లోనూ వైరుధ్యాలు లేవు. వారు శాస్త్రీయ కారణాల్ని విశ్లేషించారే తప్ప కొత్త వివాదాంశాల్ని ప్రస్తావించలేదు.

డాక్టర్ మహేష్‌గుప్త చెన్నై

★ మార్కెట్‌లో వాస్తు పుస్తకాలు చాలా వస్తున్నాయి.

ప్రాచీన వాస్తుశాస్త్రాల అనువాద గ్రంధాలు మాత్రమే కొనండి. తక్కినవన్నీ కొనడం దండగ.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
45 వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్ట్, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

డాక్టర్ డి.ఉమాదేవి సికింద్రాబాద్

★ దక్షిణం తొమ్మిది భాగాల్లో ఏయే స్థానాల్లో ఉపద్వారాలు, ప్రధానా ద్వారాలు ఏర్పాటు చేసుకోవాలి?

అగస్త్య, ముహూర్త మార్తాండం, వశిష్ఠ వాస్తు శాస్త్రాల ప్రకారం దక్షిణాన్ని తొమ్మిది భాగాలుగా విభజించి 1, 2, 3 సింహద్వారాలకు, 7 ఉపద్వారానికి ఉపయుక్తం. అన్నింటి కన్నా నాల్గవ స్థానం 'మహేంద్ర పాదం' ఉచ్ఛం(శ్రేష్ఠం).

విశాల్ జైన్ నెల్లూరు

★ మాగుంట లేఅవుట్‌లో ఒక ఇల్లు కొనాలనుకొంటున్నాను. ప్లాను పంపిస్తున్నాను.

ఈశాన్య ఉచ్ఛ, ఉత్తరం శ్రేష్ఠత్వాల వల్ల ఆ ప్రాంత అభివృద్ధి గణనీయమే అయినా నైరుతి, వాయువ్య, ఆగ్నేయ దోషాలు ఆ ప్రాంతంలో ఆర్థిక, ఆరోగ్య, కుటుంబ సమస్యల్ని చావ క్రింద నీరులా ప్రబలజేస్తున్నాయి. మీ ప్లాను కూడా అలాంటిదే. కొనకండి.

వి.వి.ఎన్.రెడ్డి నెల్లూరు

★ ఆర్థికంగా బాగుంది. వలుకుబడి వుంది. అయినా రాజకీయంలో అడుగు ముందుకు వడటం లేదు.

జాతకం చూశా, రాహుకేతు స్థానాల్లో కదలికలు లేవు. మరో మూడేళ్లు మీ పరిస్థితిలో మార్పు ఉండదు.

"సీర్వాంతీర్వామి"

నీ పరిచయం నాకక్కర్లేదు
గుండె కరిగి కన్నీరవుతున్న చోట
ఆకలి రెండు చేతుల్నీ చాచిన చోట
వానమబ్బు ముసురుకున్న వేళ
దిగాలుగా నువ్వు ఆకాశం కింద
ఒంటరిగా నిలుచున్న చోట
పదిమందీ ఉన్న గుంపులో
గొంతు పెగలని నీ మాట వినిపిస్తున్న చోట
వైన్‌షాపుల ముందు – హోటళ్ల ముందు
వృద్ధాప్యం భిక్షగానమై పోయిన చోట
కుళ్లిపోయిన పళ్లను విసిరేసిన
కుప్పతొట్ల రంగవల్లిలో
నీవు కుంకుమ పూలు ఏరుతున్న చోట
తోలుతిత్తుల మానవ సంబంధాలకు
నువ్వొక అంటరాని మురికి ప్రాణివై పోయిన చోట
అక్కడ ఇక్కడ ఇంకెక్కడో అనికాదు
చంకన బిడ్డనెత్తుకొని
ఏ తల్లి కనిపించినా
వృద్ధ రూపంలో నువ్వే దర్శనమిస్తుంటావు
నీ పరిచయం నాకక్కర్లేదు.

-వి.మురళీమోహన్‌రాజు, నెల్లూరు.

రాజకీయ విభేదాలతో లేగుంటపాడులో ఆగిన అభివృద్ధి!

కోవూరు మండలం లేగుంటపాడు గ్రామ పంచాయితీపై అధికారులు సవతి తల్లి ప్రేమను కనబరుస్తున్నారు. దేశానికి పట్టుకొమ్మలు గ్రామ పంచాయితీలని సభలు, సమావేశాల్లో ప్రకటనలు గుప్పించే ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం వీటి అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదంటే ఆశ్చర్యపోక తప్పదు. రాజకీయపార్టీల మధ్యన ఏర్పడిన విభేధాల మూలంగా అభివృద్ధి పనులు ఆగిన గ్రామంగా లేగుంటపాడును పేర్కొనవచ్చు.

ఈ గ్రామ పంచాయితీలో 700 కుటుంబాలు, నాలుగువేల జనాభా, రెండువేల మంది ఓటర్లు వున్నారు. ఈ పంచాయితీకి భారతీయ జనతా పార్టీకి చెందిన స్వర్ణ వెంకమ్మ ఏకగ్రీవంగా ఎన్నికై సర్పంచ్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పేరుకే ఈమె సర్పంచ్‌గా వుంటుంది. మిగిలిన వ్యవహారాలన్నీ ఉపసర్పంచ్ జెట్టి రాజగోపాలరెడ్డి చూస్తుంటారు. 12 వార్డులు కలిగిన ఈ పంచాయితీలో వివిధ పన్నుల రూపంలో లక్షా 70వేల రూపాయల వరకు వసూలు అవుతుంటాయి. ఇవి కాకుండా ఎస్ఎఫ్‌సి నిధులు 15వేలు, 12వ ఆర్థిక సంఘం నిధులు మరో 60వేల రూపాయలు ప్రభుత్వం ఈ గ్రామ పంచాయితీకి అభివృద్ధి పనులు చేపట్టేందుకు విడుదల చేయడం జరిగింది. ప్రభుత్వం విడుదల చేసే నిధులు ఏమాత్రం అభివృద్ధి పనులకు సరిపోవడం లేదని ఇక్కడి ఉపసర్పంచ్ చెప్పున్నారు. ఇంతే కాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వుండడం, నియోజకవర్గ ఎమ్మెల్యేగా తెలుగుదేశం పార్టీకి చెందిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కొనసాగడం ఈ పంచాయితీకి శాపంగా మారింది. రెండు పార్టీల మధ్య కొంతమేర విభేదాలు వుండడం వల్ల అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు కేటాయింపు జరగడం లేదు. పంచాయితీ పాలకవర్గం బిజెపికి చెందినవారు కావడంతో కొంతమేర అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నది వాస్తవం. పాలక వర్గానికి ఎటువంటి రాజకీయ అండదండలు లేకపోవడం వల్ల మంజూరవుతున్న కొద్దిపాటి నిధులతో సరిపెట్టుకోక తప్పడం లేదు.

ఈ పంచాయితీ పరిధిలో డ్రైనేజి కాల్వలు, అంతర్గత రోడ్లు చాలా అధ్వాన్నంగా వున్నాయి. ఇతర పంచాయితీలలో కొంతమేర సిమెంటురోడ్ల నిర్మాణం జరిగినా ఈ పంచాయితీలో మాత్రం సిమెంటురోడ్లు నిర్మాణం జరగలేదు. ఇటీవల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, జిల్లాస్థాయి అధికారులు సైతం ప్రకటనలు కూడా చేశారు. అయితే వాస్తవంగా ఈ పథకం ద్వారా ఈ పంచాయితీలో ఎటువంటి రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు కూడా తయారు కాలేదు. ఇప్పటి వరకు చేపట్టలేదు. ఉపాధిహామీ పథకం గురించి గ్రామస్తులను ప్రశ్నిస్తే అధికారులపై మండిపడుతున్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

పంచాయితీ పాలకవర్గం సభ్యులు మొత్తం ఒకే పార్టీకి చెందినవారు కావడంతో పంచాయితీ అభివృద్ధి విషయంలో పెద్దగా దృష్టి సారించలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయితీలో చేపట్టిన అభివృద్ధి పనులు, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉపసర్పంచ్ వెల్లడించిన అభిప్రాయాన్ని ప్రక్కనిస్తున్నాం.



లేగుంటపాడు గ్రామ పంచాయితీ కార్యాలయం.



డ్రైనేజి కాల్వలు ఏర్పాటు చేయాలి!

మా గ్రామపంచాయితీలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. డ్రైనేజి కాల్వల నిర్మాణం, సిమెంటు రోడ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధుల్ని కేటాయించాలని అనేకసార్లు అధికారులకు విన్నవించడం జరిగింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద మా పంచాయితీలో ఒక్క పనికూడా చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అభివృద్ధికి సహకరించాలి.

– జె.రాజగోపాలరెడ్డి, ఉపసర్పంచ్

అవినీతి కథ

దీపం పథకంలో అవినీతి కోణం!



ప్రేక్షకపాత్రలో ఇందిరక్రాంతి పథం కార్యాలయం.

గ్రామీణ ప్రాంతాలలో స్వయం సహాయక సంఘం సభ్యులకు దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు కేటాయించాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరకుండాపోయే ప్రమాదం ఏర్పడింది. గ్యాస్ కనెక్షన్లు కేటాయించేందుకు మార్గదర్శకాలను అమలు చేయకపోవడంతో పొదుపు గ్రూపులీడర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆర్థిక స్థోమత వున్న గ్రూపులీడర్లే గ్యాస్ కనెక్షన్లు తీసుకోసేందుకు తమ పేర్లను సిఫార్సు చేసుకున్నారు. ఇంతకు ముందే గ్యాస్ కనెక్షన్లు వున్న గ్రూపులీడర్లు మాత్రం చేతివాటం ప్రదర్శించి ఇతర సభ్యులకు ఇస్తామంటున్నారు.

మండలపరిషత్, ఇందిరాక్రాంతి పథం, పంచాయితీ కార్యదర్శులు సంయుక్తంగా గ్రామసభలు నిర్వహించి గ్యాస్‌కనెక్షన్ కోసం లబ్దిదారులను ఎంపిక చేయాల్సి వుంటుంది. కొన్ని గ్రామాలలో గ్రామసభల ద్వారా ఎంపిక జరగ్గా మరికొన్ని గ్రామ పంచాయితీలలో రాజకీయ జోక్యంతో లబ్దిదారుల ఎంపిక జరిగిపోయింది. మరికొన్ని గ్రామాలలోనైతే గ్రామస్తులకు సమాచారం లేకుండానే పొదుపు గ్రూపు లీడర్లు గుట్టుచప్పుడు లేకుండా ఈ తతంగం పూర్తి చేశారన్న ఆరోపణలు వున్నాయి. గ్యాస్‌కనెక్షన్ల పుణ్యమా అంటూ గ్రామీణ ప్రాంతాలలో వివాదాలు రాజుకొంటున్నాయి.

గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే దీపం పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తిరిగి గ్యాస్ కనెక్షన్ల మంజూరుకు శ్రీకారం చుట్టింది. గతంలో ఎంతమందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు, ఎన్ని పెండింగ్‌లో వున్నాయి, ప్రస్తుతం ఎంతమంది అర్హులుగా వున్నారన్న పూర్తి వివరాలు అధికారుల వద్ద లేవు. జిల్లావ్యాప్తంగా లక్షల్లో లబ్దిదారులు వుంటే వేలల్లో గ్యాస్ కనెక్షన్లు కేటాయించడం పొదుపుగ్రూప్ లీడర్లకు బాగా కలిసివచ్చింది.

ఒక్కో మండలానికి వంద నుంచి 150 వరకు గ్యాస్‌కనెక్షన్లు కేటాయించారు. ఈ వంతున 20 పంచాయితీలున్న మండలంలో ఒక్కో పంచాయితీకి 5 నుంచి 6 వరకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాల్సి వుంటుంది. ఇవి ఏమాత్రం గ్రామీణ ప్రాంతాల మహిళలకు సరిపోవు. పంచాయితీకి కేటాయించిన కనెక్షన్లను ఎవరికి కేటాయించాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. లబ్దిదారులను ఎంపిక చేసుకునే బాధ్యతలను పొదుపు గ్రూప్‌లీడర్లకు అప్పగించారు. దీనిని ఆసరా చేసుకొని కొందరు లీడర్లు 300 నుంచి 500 వరకు డిమాండ్ చేస్తున్నారు.

గ్యాస్ కనెక్షన్లు పొందేందుకు బాగా పోటీ పెరగడంతో ఎవరు ముందుగా నగదు చెల్లిస్తే వారిని ఎంపిక చేస్తున్నారు. పొదుపు గ్రూపు సభ్యులకు బాసటగా వుండాల్సిన గ్రూపులీడర్లు తమ స్వార్థం కోసం అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. సంవత్సరాల తరబడి ఒక్కరే మొత్తం పెత్తనం చెలాయిస్తున్నారు. ఇందిరా క్రాంతి పథం నిబంధనల ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకోసారి కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సి వుంటుంది. మహిళల అమాయకత్వాన్ని అలుసుగా తీసుకుంటున్న కొందరు లీడర్లు సభ్యులకు తెలియకుండా బ్యాంకుల నుంచి నిధులు డ్రా చేస్తున్న సంఘటనలు కూడా అనేకం జరుగుతున్నాయి.

> “జిల్లాలో దీపం పథకం క్రింద గ్యాస్ సిలిండర్లు అందించే విధానం అబాసుపాలుగా తయారయ్యింది. ఆర్థిక స్థోమత వున్న పొదుపుసంఘాల లీడర్లు గ్యాస్ కనెక్షన్లు తీసుకొనేందుకు తమ పేర్లే సిఫార్సు చేసుకొంటున్నారు.”

గ్యాస్ కనెక్షన్ల పేరిట పొదుపుగ్రూప్ లీడర్లు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న విషయం అధికారులకు తెలిసినా కూడా రాజకీయ జోక్యం కారణంగా చర్యలు తీసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికైన జిల్లాస్థాయి అధికారులు స్పందించి దీపం పథకం లబ్దిదారుల ఎంపికలో చోటు చేసుకున్న పరిణామాలపై విచారణ జరిపిస్తే కొందరికైనా మేలు జరిగే అవకాశం వుంటుంది.

పవర్ యోగాలో త్రిష!



దాల నటి త్రిష మరింత అందంగా కనిపిస్తుంది. ఇదే విషయాన్ని ఆమెను అడిగితే నేనీమధ్య పవర్ యోగా చేస్తున్నాను. మనసుకు ఎంతో తృప్తి నివ్వడంతోపాటు శరీరానికి కూడా మంచి వ్యాయామాన్ని కల్పిస్తుంది. ఇంట్లోనే నాకు మినీ జిమ్ వుంది. మాస్టర్ అక్కడికే వచ్చి నేర్పిస్తున్నారు. షూటింగ్‌లు వుంటే వీలు పడట్లేదు. మిగిలిన అన్ని రోజుల్లోనూ చేస్తున్నాను. ఇంతకు ముందు లాగా విశ్రాంతి లేకుండా పనిచేయడం తగ్గించుకొన్నాను. నెలలో కొన్ని రోజులు నాకోసం కేటాయించుకున్నాను. ఫలితం బ్రహ్మాండంగా వుందంది.

గోల్డెన్‌లెగ్ నట!


టు తెలుగు, అటు హిందీ చిత్రాల్లో బిజీగా ఇవున్న జెనీలియాను కథ చిత్రం షూటింగ్ గ్యాప్‌లో పలుకరించాను. అదృష్టం, శ్రమల్లో దేన్ని నమ్ముతారంటే నిజమైన కష్టం తప్పకుండా ఫలితాన్నిస్తుంది. నా కెరీర్ ప్రారంభించినపుడు నన్ను ఐరన్ లెగ్ అన్నారు. నా అదృష్టం ఏమిటంటే అలా అన్నపుడు కూడా నా సినిమాలు నాలుగు సెట్స్‌మీద వుండేవి. ఇపుడు నన్ను గోల్డెన్‌లెగ్ అంటున్నారు. వస్త్రధారణ విషయంలో నేనెప్పుడూ జాగ్రత్తగానే వుంటాను. ముఖాన్ని ముఖ కవళికలను ఎక్స్‌పోజ్ చేయడమే ఇష్టం. అంతకు మించి హద్దులు దాటే ప్రయత్నాలు చేయనంది.

నేను తగ్గడం నచ్చడం లేదు!



ఈ మధ్య కాస్త లావు తగ్గిన నమిత తనను పలకరించిన ప్రతివారితోనూ ఇదే విషయాన్ని ముచ్చటిస్తుంది. సింహ షూటింగ్ గ్యాప్‌లో మాట్లాడుతూ నేను లావుగా వున్నా నన్ను అభిమానులు ఆదరించారు. నేను తగ్గడం కొందరికి నచ్చడం లేదు. మీరు ఇంతకుముందే బాగున్నారు అని తరచూ ఈ-మెయిల్స్ పంపుతున్నారు. నాకు ఇంతకు ముందు కన్నా ఇపుడే బాగున్నాననిపిస్తోంది. కొత్త కెరీర్‌ను ప్రారంభించినట్టుంది. బరువును ఇలాగే కొనసాగించాలన్న విషయంలో నేను చాలా కచ్చితంగా వుంటున్నాను. క్రమం తప్పకుండా యోగా చేస్తున్నాను. పార్టీలు, పబ్‌లకు వెళ్లట్లేదు. సమయానికి భోజనం చేసేస్తున్నాను. స్నేహితులు బలవంతపెట్టినా చికెన్ ముక్కలు తినడం లేదంది నమిత.





ఈరోజు గూర్చే ఆలోచిస్తా


నేనింతే' చిత్రంలో నటనకుగాను హీరో రవితేజకు ఉత్తమ నటునిగా నంది అవార్డు వచ్చింది. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ ఈ చిత్ర నిర్మాత పూరీ జగన్నాధ్‌కు కూడా ఉత్తమ మాటల రచయితగా అవార్డు రావడం ఆనందాన్నిస్తుంది. నేనింతే మంచి సినిమా. ఫలితం ప్రక్కన పెడితే నటుడిగా పూర్తి సంతృప్తినిచ్చింది. నేనెప్పుడూ రేపటి గూర్చి ఆలోచించను. ఈ రోజు నేనేంటి? అనే ప్రశ్నే వేసుకుంటా. ఈ రోజులోనే జీవిస్తా. భవిష్యత్తు గూర్చి కలలుకనను. నాకు సరిపడే పాత్రల్నే ఎంచుకుంటా. ప్రేక్షకులకు వినోదం పంచివ్వడమే తన పనన్నాడు రవితేజ.

అల్లూరు రహీం

చిత్ర సమీక్ష

సంసారపక్షంగా లేని అ.ఆ.ఇ.ఈ!

లో బడ్జెట్‌లో హాస్యచిత్రాలు తీస్తాడన్న పేరు తెచ్చుకొన్న దర్శకుడు శ్రీనివాస్‌రెడ్డి తీసిన బూతుల బుంగ అ.ఆ.ఇ.ఈ చిత్రం. ఈ సినిమాలో కుటుంబ కథ మాటున పేర్చిన అసభ్యపు కదంబాన్ని సంసారపక్షీయులెవరూ చూడలేరు. బ్రహ్మానందం, కోవై సరళ, కృష్ణభగవాన్, రఘుబాబు, అపూర్వ, అలీ, ఎంఎస్.నారాయణ కాంబినేషన్‌లో నడిచే నస్ని వేశాలు, వాటికి జతచేసిన పాటలు పరమ రోతగా వున్నాయి. ఇవిచాలవన్నట్లు వ్యాంప్‌లు రమ్యశ్రీ, కౌషల అర్ధనగ్న ప్రదర్శనలు, వీరికి పోటీగా తెలుగు సినిమాల్లో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన హీరోయిన్ సదా చేసిన దేహ ప్రదర్శన హద్దులు దాటింది. ఈ సినిమా కథలో మలుపు హీరోయిన్ మీరాజాస్మిన్ గుండెకు చేసే మైత్రిల్ వాల్వ్ ఆపరేషన్. ఈ ఆపరేషన్‌కు ఎక్కువంటే రెండున్నర లక్షలు ఖర్చవుతాయి. కాని ఓ సన్నివేశంలో దర్శకుడు ఎనిమిది లక్షలు కావాలని ఓ డాక్టర్ చేత చెప్పిస్తాడు. ఈ ఆపరేషన్ చేయించుకొన్న హీరోయిన్ రైలు పట్టాలపై ప్రసవిస్తే ప్రాణం పోతుందన్న చిన్న విషయం కూడా దర్శకునికి తెలియదంటే ఈయనకున్న పరిజ్ఞానం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. తన 50వ చిత్రానికి సంగీతం కూర్చిన ఎం.ఎం.శ్రీలేఖ అందించిన బాణీలన్నీ మాస్‌మాసాలాలే. అయితే పుప్పొడికన్నా నాజుకు అంటూ హీరోయిన్ మీరా జాస్మిన్‌ను వర్ణిస్తూ హీరో శ్రీకాంత్ పాడే పాటలో ఆమె మాదరన్ డ్రస్సులో దిబ్బలా కనిపిస్తుంది. కష్టాల్లో కథ సాగుతున్నపుడు 'నిన్ను ఒక్కసారి చూడకుంటే' చరణంతో పాట పెట్టడం సహేతుకంగా లేదు. దర్శకుడు కె.రాఘవేంద్రరావు చిత్రాల్లోని 50కిపైగా పాటలు చూసి రూపొందించామని దర్శకుడు ఘనంగా చెప్పుకొన్న 'అచ్చటా ముచ్చటా' పాటకు ఆస్థాయి లేదు.



చిత్ర కథలోనికి వెళ్తే టాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తుండే చంద్రం (శ్రీకాంత్) దేశభక్తుల కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. నీతినిజాయితీతో విధులు నిర్వహిస్తుండే ఈయన సతీమణి కళ్యాణి (మీరాజాస్మిన్)కు పిల్లలుండరు. దీంతో ఈ దంపతులు వీధిలోని పిల్లలను తమ పిల్లలుగా ఆదరిస్తూ వారిచేత మమ్మీ-డాడీగా పిలిపించుకొంటుంటారు. కొన్నేళ్లకు కళ్యాణి నీళ్లు పోసుకొంటుంది. జనరల్ చెకప్‌కు ఆస్పత్రికి వెళ్లిన కళ్యాణిని పరీక్షించిన డాక్టర్ తక్షణం ఆమెకు గుండె ఆపరేషన్ చేయాలని దీనికి గాను ఎనిమిది లక్షల రూపాయలు కావాలంటుంది. దీంతో చంద్రం ఆందోళనపడతాడు. పలువిధాలుగా ఆలోచిస్తూ రైలు పట్టాలపై తిరుగుతున్నపుడు ఒక మహిళ శవం, పది లక్షల రూపాయల డబ్బు బ్యాగ్ కనపడుతుంది. దాన్ని తీసుకొని పోలీసుస్టేషన్‌కు వెళ్లగా ఇన్స్‌పెక్టర్ (పృథ్వీరాజ్) ఈ కేసులో చంద్రాన్ని ఇరికించాలని చూస్తాడు. ఇంతలో చంద్రం మిత్రుడు లాయర్ కృష్ణబాబు (కృష్ణభగవాన్) రంగం ప్రవేశం చేసి ఇన్స్‌పెక్టర్‌కు బ్యాగులోని డబ్బు కాస్త లంచమిచ్చి చనిపోయింది అతని భార్యని నమ్మబలికి బయటకు తీసుకువెళ్లాడు. ఈ బ్యాగ్‌లోనే రమ్య(సదా) ఫోటో వుండడంతో ఆమె చనిపోయిందని పత్రికల్లో వ్రాస్తారు. ఇది చూసి ఆమె తండ్రి విశ్వనాధం (తనికెళ్ల భరణి)కి గుండెపోటు వస్తుంది. రమ్య శవానికి పోస్టుమార్టం చేసిన డాక్టర్ పితాపురం (ఎంఎస్.నారాయణ), చంద్రం గూర్చి విశ్వనాధంకు చెబుతాడు. దీంతో వాళ్లు చంద్రానికి కబురుపెట్టి తమ ఇంటికి తీసుకువెళ్తారు. రైలు పట్టాలపై దొరికిన డబ్బుతో చంద్రం, కళ్యాణికి గుండె ఆపరేషన్ చేయిస్తాడు. రమ్య కర్మకత్రువుల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఆమె తిరిగి ప్రత్యక్షమవుతుంది. రమ్య మరణం వెనుక దాగిన మిస్టరీ చెప్పమని ఒత్తిడి చేస్తాడు. దీంతో ఆమె తాను వెంకట్ (వెంకటి)ను ప్రేమించానని కాని అతను మరో యువతిని కూడా వంచించిన విషయం తెలుసుకొని అతనికి దూరమయ్యానంటుంది. వెంకట్ తనకన్నా ముందు ప్రేమించిన యువతిని రైలు పట్టాలపై చంపి తనను ఇంకా బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడన్న విషయం బయటపెడుతుంది. క్లైమాక్స్‌లో హీరో ఒక ఫైట్ చేసి వెంకట్‌ను పోలీసులకు పట్టించడంతో అ.ఆ.ఇ.ఈకు శుభం కార్డు పడుతుంది.

డ్యూటీ చేయని
ట్రాఫిక్ పోలీసులు

తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్

[illegible]



నెల్లూరు నగరంలో ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహించే పోలీసులు విధులుమాని మామూళ్లు, చలానా వసూళ్లు చేసుకొంటు న్నారు. దీనివల్ల నగరంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు ఎక్కువవుతుందే తప్ప ఏమాత్రం తగ్గడం లేదు. 2004 నుంచి 2009 వరకు నగరంలో ట్రాఫిక్ డ్యూటీ నిర్వహించే పోలీసులు జరిమానాల పేరిట రెండు కోట్ల రూపాయలు వసూలు చేశారు. దీనికి మూడింతలు మామూళ్ల రూపంలో సంపాదించి వుంటారని తడుముకోకుండా చెప్పవచ్చు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీని బట్టి ఆయా వేళల్లో పోలీసులు విధులు నిర్వర్తించాల్సి వుంది. కానీ ట్రాఫిక్ పోలీసులు వారికిష్టమైన సమయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఒంటి గంట వరకు సాయంత్రం ఐదు నుంచి పది గంటల వరకు విఆర్‌సి, పొగతోట, గాంధీబొమ్మ సెంటర్, ట్రంకురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, ఆత్మకూరు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, రామలింగాపురం, అయ్యప్ప గుడి కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించాలి. కొన్ని కూడళ్లలో ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది వరకు, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు మరో బ్యాచ్ విధులు నిర్వహించాలి. అంటే ఉదయం ఆరు గంటల నుండి రాత్రి పది గంటల వరకు ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తుండాల్సిందే. కానీ వాస్తవంగా ట్రాఫిక్ పోలీసులు డ్యూటీచేస్తే ట్రాఫిక్ సమస్యనే ఉత్పన్నం కాదు. విధులు నిర్వహించకుండా బాతాఖానీ, మామూళ్ల వసూళ్లు, అప్పుడప్పుడు చలానాలు వ్రాసే పనిలో నిమగ్నమవడం వల్ల ట్రాఫిక్ అస్తవ్యస్తమవుతోంది. జనాన్ని మహా ఇబ్బందుల పాలు చేస్తున్నది.

నెల్లూరులో వరద భీభత్సం



మన్సూర్‌నగర్‌లో ఇంటిలోకి నీరు. జనశక్తినగర్‌లో కూలిన చెట్టు.

ఈవారంలో కురిసిన వర్షాల కారణంగా నెల్లూరు నగరంలో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నగర నడిబొడ్డున వున్న ప్రధాన ప్రాంతాలతోపాటు శివారు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జనార్ధన్‌రెడ్డి కాలనీ, వెంకటేశ్వరపురం, అనగుంట, జనశక్తినగర్, కళ్యాణ్‌నగర్, జగజ్జీవన్ రామ్‌నగర్, అయ్యప్పగుడి, డ్రైవర్స్‌కాలనీ తదితర ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. పలు చోట్ల ఇళ్లలోకి నీరు వచ్చి చేరడంతో ఆ ప్రాంత వాసులు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సి వచ్చింది. అభివృద్ధి చెందని ప్రాంతాలు, శివారు ప్రాంతాలతోపాటు నగరంలో బడాబాబులు నివాసం వుండే ప్రాంతంగా గుర్తింపు పొందిన మాగుంట లేఅవుట్ సమస్తం జలమయం అయ్యింది. నీరు పోయేందుకు వసతి లేకపోవడంతో ఇళ్ల చుట్టూ నీరుచేరి చెరువులను తలపిస్తున్నాయి. ఆత్మకూరు బస్టాండ్, రామలింగాపురం, మాగుంట అండర్ బ్రిడ్జిల వద్ద నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రామలింగాపురం బ్రిడ్జి వద్ద రెండు బస్సులు నీటిలో చిక్కుకొన్నాయి.

● రేషన్‌షాపుల తనిఖీకి శ్రీకారం

జాయింట్ కలెక్టర్ చేసిన మంచి పని



రేషన్‌షాపు డీలర్లపై నిత్యం ఆరోపణలు, ఫిర్యాదులు అందుతుండడంతో జిల్లా జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ నగరంలోని దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వెంకటేశ్వరపురం, జనార్ధన్‌రెడ్డి కాలనీ తదితరప్రాంతాలలోని పలు చౌకదుకాణాలను ఆయన నిశితంగా పరిశీలించారు. జెసి ఒకటి రెండు రేషన్ షాపులకు వెళ్లగానే సమాచారం మిగతా వారికి తెలిసిపోయి ఎక్కడి దొంగలు అక్కడ గప్‌చుప్ అన్న చందంగా డీలర్లు జెసి తనిఖీకి వచ్చేటప్పటికి అన్నీ సర్దుకొని సిద్ధంగా వున్నారు. ఎప్పుడూ వినియోగదారులకు తక్కువ తూకం, తూకాల్లో మోసాలకు పాల్పడే రేషన్‌షాపు నిర్వాహకులు బుద్ధిమంతులుగా మారి కొంచెం ఎక్కువే తూచారు. ఇది చూసి విస్తుపోవడం వినియోగదారుల వంతైంది. అయితే డీలర్లు ఎంతగా నటించినా పలుచోట్ల వినియోగదారులు రేషన్‌షాపు నిర్వాహకుల అక్రమాలు, అవకతవకలను, దురుసు ప్రవర్తనను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. తనిఖీల సందర్భంగా జెసి, ఎదురుపడిన గ్యాస్ సిలిండర్ల సరఫరా సిబ్బందిని నిలిపి పలు రకాల ప్రశ్నలు వేసి, రశీదు పుస్తకాలు పరిశీలించారు.

వివేకాను నిలదీసిన జనం!

తన హావభావాలు, వెకిలి చేష్టలతో ప్రజలను ఆకట్టుకోవాలని ప్రయత్నించిన రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డికి ప్రజల నుంచి నిరసన ఎదురయ్యింది. మునిసిపల్ పరిధిలోని ఒకటి, యాభైయ్యవ వార్డులలో ఆయన పర్యటించారు. వర్షాలకు నీరు వచ్చి చేరడంతో ఆ ప్రాంతంలో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. అక్కడకు వివేకా మేయర్ భానుశ్రీతో కలసివెళ్లి రాజకీయ ఉపన్యాసం ఇవ్వబోగా ఆ

చేసిన అభివృద్ధి చెప్పమన్నారు

ప్రాంత ప్రజలు తిరగబడ్డారు. వివేకా మాట్లాడుతుండగా మాటలు ఆపండి, ఇప్పటివరకు ఏమి చేశారు మీరు. కోట్ల రూపాయల నిధులు వస్తున్నా మా ప్రాంత అభివృద్ధికి ఏమీ చేయలేదు. ఎప్పుడు వర్షాలు వచ్చినా నీళ్లు వస్తున్నాయి. కాంట్రాక్టర్లు బాగుపడుతున్నారు తప్ప మాకేమీ చేయలేదు. డిఎఫ్‌ఐడి నిధులు, ఇతర మునిసిపల్ నిధులు ఏమి చేస్తున్నారు. అవేమీ చేయకుండా ఇప్పుడొచ్చి మాట్లాడితే ఎలా అని ప్రశ్నించడంతో వివేకాకు నోటమాటరాక అది కప్పిపుచ్చుకొనేందుకు రకరకాల కథలు చెప్పాడు.

మాతృభాషను ప్రేమించాలి



ఎబికె ప్రసాద్

మాతృభాషను ప్రేమించి, పరభాషను గౌరవించే సంస్కృతిని పిల్లలకు నేర్పించాల్సిన బాధ్యత తల్లితండ్రులదేనని రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు ఎబికె ప్రసాద్ స్పష్టం చేశారు. నెల్లూరులోని ఆదిత్య కాలేజి తెలుగు భాషోద్యమ సమితి 8వ తేది ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భాషాపరమైన గందరగోళానికి తల్లి తండ్రులే బాధ్యత వహించాలి. ఇంట్లో పిల్లల చేత మమ్మీ - డాడీ అని పిలిపించుకోవడాన్ని తెలుగువాళ్లు మానాలన్నారు. తెలుగు అధికారులను కూడా పరిపాలనాపరంగా తెలుగు భాషను అమలుచేయాలని అడుక్కోవాల్సిన దుస్థితి రాష్ట్రంలో వుందన్నారు. ఇటీవల మైదుకూరులోని ఓ స్కూల్‌లో తెలుగు మాట్లాడడం మహాపరాధమని పిల్లల మెళ్లో బోర్డును వేలాడదీయడం అనాగరికం. కర్నాటకలో మాదిరి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకేరకమైన సిలబస్ విధానం అమలు చేస్తే ఇటువంటి సమస్యలుండవన్నారు. సచివాలయ స్థాయి నుండి మండలస్థాయి వరకు తెలుగు అమలుకు నోచుకోకపోవడానికి పాలకుల అశ్రద్ధే కారణమని ఎబికె ప్రసాద్ అభిప్రాయపడ్డారు. అధికార భాష సంఘం అధ్యక్షునిగా తెలుగు భాష అమలుకోసం తన హయాంలో శక్తివంచన లేకుండా కృషిచేసినట్లు ఎబికె చెప్పుకొన్నారు.

పోటా పోటీ పరామర్శలు

వర్షాలు, వరదలు సంభవించినప్పుడు లోతట్టు ప్రాంతాల ప్రజలను నేతలు పరామర్శిస్తుండడం సహజం. నగర కాంగ్రెస్‌లో ఏర్పడిన గ్రూపుల కారణంగా ఇలాంటి పరామర్శలు, సందర్శనలలో పోటాపోటీ నెలకొంటున్నది. వెంకటే

వర్షబాధితుల పరామర్శలో వివేకా - అనిల్

శ్వరపురం, జనార్ధన్‌రెడ్డి కాలనీ తదితర ప్రాంతాలలో వర్షాల కారణంగా జలమయం అయ్యి ఇళ్లలోనికి వర్షపు నీరు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలను కలసుకొని వారిని తగినవిధంగా ఆదుకొనేందుకు అటు రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి, నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పోలుబోయిన అనిల్ ఇరువురు పోటాపోటీగా ఆయా ప్రాంతాలను సందర్శించారు. రాజీవ్‌భవన్ నాయకులతో కలసి అనిల్ అక్కడకు వెళ్తే, ఆనం వివేకానందరెడ్డి, మేయర్ భానుశ్రీ ఇతర కార్పొరేటర్లు కలసి ఆ ప్రాంత వాసులను పలకరించారు. పోటాపోటీ పరామర్శలతో స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. రాజకీయాల సంగతి ప్రక్కనబెట్టి తమను ఆదుకోవాలని వారు కోరారు.

సున్నాచుట్టిన సోనియా

మొదటి పేజీ కొరవ

భవిష్యత్తులో మరే రాష్ట్ర నాయకుడిని కూడా ఈ స్థాయిలో పెంచకూడదని సోనియాగాంధీ వ్యాఖ్యానిస్తున్నారట. అందువల్లనే జగన్ ఎంత ప్రాధేయపడినా, బెదరింపులకు దిగినా తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లని భావిస్తున్నారు సోనియాగాంధీ.

ఇపుడు జగన్ ముందున్న దారి ఏమిటి? ఢిల్లీ నుంచి నేరుగా బెంగుళూరు వెళ్లిపోయిన ఆయన, తన కుటుంబసభ్యులు, సన్నిహితులతో సుదీర్ఘ మంతనాలు నడిపాడు. ఎంతో లోతుగా ఆలోచన చేశాడు. చివరగా ఆయన చేసిన నిర్ణయం ఎట్టి పరిస్థితులలో పులివెందుల పోటీ నుంచి తప్పుకొనేది లేదని. కాంగ్రెస్ టిక్కెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా తన తండ్రి ఖాళీ స్థానం నుంచి తాను పోటీ చేయాలన్నది జగన్ స్థిర నిర్ణయం. కాంగ్రెస్ అగ్రనాయకత్వానికి తనను ముఖ్యమంత్రి చేయడం ఇష్టం లేదని బాగా అర్థమైపోయింది. ఇప్పటికే చాలా సమయం వృధా చేశాము. దానివల్ల తమ ముఖ్య అనుచరులను కొన్నవారు కూడా జారి పోతున్నారు. పులివెందుల టిక్కెట్ ఇవ్వకపోయినా మౌనం వహిస్తే, మన దగ్గర మనిషి మిగలడు. సోనియాగాంధీ కానీ, ఢిల్లీ పెద్దలు కానీ ఒక పథకం ప్రకారం తమ వర్గాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు అర్థమైన తర్వాత ఇంకా వారినే నమ్ముకొని వుండడం ఆత్మహత్యా సదృశ్యమౌతుంది, అంటున్నాడు జగన్.

అయితే ఇప్పటికిప్పుడు పార్టీ మీద తిరుగుబాటు చేసి బయటకు వెళ్లడన్న నింద తన మీద పడకుండా, పార్టీ తనను ఇబ్బంది పెడుతున్నదనే ప్రచారం జరిపించి, వారి ద్వారానే బయటకు పంపించుకోవడం వల్ల జనం సానుభూతి దక్కుతుందన్నది ఆయన ఆలోచన. అందుకు నాంది - కడపజిల్లాలో జరిగిన సభలో నన్ను ముఖ్యమంత్రి కానివ్వకుండా ఎవరూ అడ్డుకోలేరనే ప్రకటన.

సిఎల్పీ సమావేశంలో కాంగ్రెస్ అధిష్టానంతో ముఖాముఖి పోరుకు తలపడాలన్నది జగన్ వ్యూహం. రాజ్యాంగం ప్రకారం ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా శాసనసభను సమావేశపరచాలి కాబట్టి, ఇపుడు కాకపోయినా జనవరి, ఫిబ్రవరి నెలల్లో సిఎల్పీ పెట్టక తప్పదు. ఆరోజు మెజార్టీ శాసనసభ్యుల మద్దతు కూడగట్టి, ఢిల్లీ నుంచి వచ్చే పరిశీలకులను గట్టిగా నిలదీసి, ఎమ్మెల్యేల అభిప్రాయాలను సేకరించమని ఒత్తిడి తేవాలన్నది జగన్ వ్యూహం. తనను గుడ్డిగా సమర్థించే యువ ఎమ్మెల్యేలు, కళ్లలు వదిలితే, తనను వ్యతిరేకించే మునలీ ముతకా సీనియర్లను, ఎమ్మీలను ఆ సమావేశంలో ఒక ఆట ఆడిస్తారని, ఆ అల్లరికి భయపడి అధిష్టానం తన కాళ్ల దగ్గరకు దిగి రావడమో, తనను బయటకు పంపడమో చేయక తప్పదని జగన్ చెప్తున్నాడు. తాను శాసనసభలో వుంటే ఏదో ఒక సందర్భం కనిపెట్టి, ముఖ్యమంత్రి కుర్చీ ఎక్కవచ్చునన్నది ఆయన ఆశ.

ఈ పరిణామం కాంగ్రెస్ అగ్రనాయకత్వానికి కూడా తెలుసు. అయితే, నెపం తమ మీద వేసుకోవడానికి వారు సిద్ధంగా లేరు. జగన్ తనంతట తానుగా తప్పు చేసేవరకు వేచి చూడాలన్నది వారి వ్యూహం. రాజశేఖర్‌రెడ్డి అంత చేస్తే, ఆయన మరణించగానే ఆయన కుటుంబానికి అన్యాయం చేశారన్న నింద తమ మీద వేసుకోవడానికి సోనియాగాంధీ సిద్ధంగా లేరు.

మొత్తానికి ఇరుపక్షాలూ వ్యూహ ప్రతివ్యూహాలతో, ఎత్తులు పైఎత్తులతో రాజకీయ నాటకం ఆడుతున్నాయి. ఈ క్రీడలో చివరి గెలుపెవరిదో వేచి చూడాల్సిందే.

డిఎస్‌కు వీడ్కోలు?



గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల తర్వాత పిసిసి అధ్యక్షుడిని మారుస్తారన్న వదంతి గాంధీభవన్‌లో బాహాటంగా వినిపిస్తున్నది. కార్పొరేటర్ టిక్కెట్ల వ్యవహారంలో డి.శ్రీనివాస్ మీద ఆరోపణలు వెల్లువెత్తడం ఇందుకొక కారణం. ఒక్కొక్క టిక్కెటుకు ఐదు నుంది 25 లక్షల వరకు రేటు పెట్టి అమ్మారని ఆయన మీద ఆరోపణలు వచ్చాయి. మరొకవైపు నగరంలోని వైఎస్ అనుకూలురైన ఎమ్మెల్యేల అనుచరులకు ఒక పథకం ప్రకారం టిక్కెట్లు రాకుండా చేశారనే విమర్శ వుంది. వైఎస్ బ్రతికి వుండగా, 150 డివిజన్ల మీద సర్వే జరిపించి, ఎక్కడ ఎవరికి టిక్కెట్లు ఇవ్వాలో ఒక జాబితా సిద్ధం చేసుకొని వుండినాడు. అయితే కోర్టు చిక్కుల వల్ల ఎన్నిక వాయిదా పడడంతో అది మూలనపడిపోయింది. తమకు టిక్కెట్లు ఇవ్వలేదనే అలుకతో ఈ ఎమ్మెల్యేలు ప్రచారానికి దూరంగా మసలుతున్నారు. జగన్ వస్తే తప్ప తాము రామని తెగేసి చెప్తున్నారు. అయితే, కేంద్రనాయకులతో తన పులివెందుల టిక్కెట్ పంచాయితీ పెండింగ్‌లో వుంది కాబట్టి, దానిపై ఏదో ఒక నిర్ణయం వచ్చే వరకు తాను ప్రచారానికి రానని జగన్ చెప్తున్నాడు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ ఓడిపోతే తన అవసరం సోనియాగాంధీ గుర్తిస్తుందని జగన్ ఆశ. అదే సమయంలో జగన్ లేకున్నా పార్టీకి వచ్చిన నష్టం ఏదీ లేదని నిరూపించడానికి డిఎస్ పట్టుదలగా వున్నాడు. ఈ ఎన్నికల ఫలితాలు ప్రతికూలమైతే పిసిసి అధ్యక్షుడి మార్పు ఖాయమని పరిశీలకుల అంచనా.

ప్రసన్న

మొదటి పేజీ కొరవ

11తేది మధ్యాహ్నం వాకాడుకు వెళ్లి నేదురుమల్లి జనార్దనరెడ్డిని, రాజ్యలక్ష్మమ్మను కలిసి వచ్చాడాయన. వాకాడులో జనార్దనరెడ్డి ఇంటికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి కుమారుడు అతిథిగా రావడం, గూడూరు డివిజన్ రాజకీయాలలో ఒక విచిత్రంగా చెప్పవచ్చు. ఆ రెండు కుటుంబాల మధ్య నలభైఏళ్లుగా రాజకీయ వైరం వుంది. ఒకరి ముఖం ఒకరు చూసుకోవడానికి కూడా ఇష్టపడని పరిస్థితి. కానీ రాజకీయాలలో శాశ్వత శత్రుత్వాలు, మిత్రత్వాలు వుండవు కదా?

అయితే ప్రసన్న తన ఇంటికి వచ్చీ రాగానే, జనార్దనరెడ్డిగారు నలభైఏళ్ల స్పర్ధ మర్చిపోయి, అక్కున చేర్చుకొంటాడా అన్నది ప్రశ్న అంత హృదయ వైశాల్యం ప్రదర్శిస్తే జనార్దనరెడ్డికి వచ్చే లాభం ఏమిటన్నది చర్చ. శీనయ్య మరణం తర్వాత గూడూరు డివిజన్‌లో నల్లపరెడ్ల ప్రాభవం బాగా తగ్గిపోయింది. ప్రసన్నకు అసలు కోటవాసులతో సంబంధాలు కూడా లేవిప్పుడు. ఇరవైఏళ్లుగా కోవూరుకే పరిమితమైపోయాడు ప్రసన్న. కోవూరులో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి జనార్దనరెడ్డికి ప్రధాన అనుచరుడిగా వున్నాడు. ప్రసన్నను చేరదీయాలంటే పోలంరెడ్డిని వదలుకోవాలి. అది జరిగేపని కాదు. పైగా ప్రసన్న విధేయత సందేహాస్పదమైనది. ఆయన తనతోనే వుంటాడన్న నమ్మకం ఏదీ లేదు. ముఖ్యమంత్రి మార్పు జరిగి, జగన్ వంటి వారు అధికారంలోకి వస్తే మళ్లీ కన్పించడు.

ఇన్ని అనుమానాలు, అనిశ్చితస్థితుల మధ్య ప్రసన్న వాకాడు కలయిక జరిగింది. ఒక కొత్త చరిత్రకు ఇది మొదలు అవుతుందా లేక ఇంతటితోనే మంగళం పలుకుతారా అన్నది ఇప్పుడే చెప్పలేము.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

సైతం ముంచెత్తడంతో పనులు ఆగిపోయాయి. ఇప్పటివరకు ఇక్కడ 28కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పనులు చేపట్టారు.

క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ సమావేశం

ది నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ 39వ వార్షికోత్సవ వేడుకలు 8తేది ఆచారివీధిలోని సంఘభవనంలో జరిగాయి. ఈ వేడుకలకు నెల్లూరు కార్పొరేషన్ 4వ డివిజన్ ఛైర్మన్ పుట్టా రామకృష్ణారెడ్డి, రాష్ట్రవాణిజ్య సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షులు ఆకుల వెంకటేశ్వర్లు విచ్చేశారు. సంఘాభివృద్ధికి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సమావేశానికి సంఘం అధ్యక్షుడు నాగసూరి కామేశ్వరరావు అధ్యక్షత వహించారు.

పొదుపు గ్రూపు సభ్యుల ఇక్కట్లు

పొదుపు గ్రూపు లీడర్లు, సభ్యులకు ఇందిర క్రాంతిపథం ఆధ్వర్యాన బ్యాంకుల ద్వారా పావలావడ్డీకి రుణాలు మంజూరు చేశారు. ఒక్కో పొదుపు గ్రూపుకు 50వేల రూపాయల చెక్కులను నగరంలో రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి అందించారు. ఇవి ఇచ్చి 20రోజులవుతున్నా చెల్లుబాటు కాలేదు. దీంతో పొదుపు గ్రూపుసభ్యులు నానాపాట్లు పడుతున్నారు. వీటి చెల్లింపుకు నెల్లూరు ఎకెనగర్‌లోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సవాలక్ష నిబంధనలు విధిస్తున్నట్లు తెలిసింది.

ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ

ప్రభుత్వ, ప్రయివేటు వైద్యశాలల్లో వైద్య చికిత్సలు వికటించినప్పుడు బాధితులకు అండగా నిలవను ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ ఏర్పాటవుతున్నది. దీనిలో జిల్లాలోని వివిధ ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు సభ్యులుగా వుంటారు. బొల్లినేని ఆస్పత్రి ఇటీవల నిర్వహించిన కంటి ఆపరేషన్లు వికటించడంపై ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 8తేది జడ్పీమీటింగ్ హాల్‌లో బహిరంగచర్చ కూడా నిర్వహించింది. ఇక్కడ ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ ఏర్పాటుకు బీజం పడిందని ఆ సంఘం ప్రధానకార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు చెప్పారు.

సెన్సార్‌బోర్డు సభ్యునిగా రాజుకు పొడిగింపు

హైదరాబాద్‌లోని ప్రాంతీయ సెన్సార్‌బోర్డు సభ్యునిగా గత రెండేళ్లుగా పనిచేస్తున్న అల్లూరీయుడు బడబాగ్ని ఆంజనేయరాజు పదవీకాలాన్ని కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ మరో రెండేళ్లు పొడిగించింది. రాజు మంచినటుడు కావడం వల్ల సినిమాలు చూసి చక్కని నోట్స్ వ్రాస్తుండడం వల్ల ఈయన పదవీ కాలాన్ని పొడిగించారట.

జనవాణి

2వ పేజీ కొరవ

కార్పొరేషన్ తప్పుడుతనం

మాగుంట లేఅవుట్‌లోని మా ఇంటికి ఇటీవలే కొత్తగా కొళాయి వేయించుకొన్నాము. మా వద్ద వేలకువేలు నగర పాలక సిబ్బంది దీనికోసం వసూలు చేశారే తప్ప రశీదులివ్వలేదు. 'జమీన్ రైతు'లో పేర్కొన్నట్లు కార్పొరేషన్ సిబ్బంది ఇంత బహిరంగంగా చీటింగ్‌కు దిగడం క్షమించరాని నేరం. ఈ వ్యవహారమై విజిలెన్స్ అధికారులు విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

టి.కె.రెడ్డి, నెల్లూరు

విద్యార్థినులకు రక్షణ లేదా?

నెల్లూరు దొడ్ల కౌసల్యమ్మ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థినులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు 'జమీన్‌రైతు'లో వచ్చిన వార్త చదివి కలత చెందాను. గతమెంతో ఘనకీర్తి కల్గిన ఈ కళాశాలలో రెండేళ్ల క్రితం పనిచేసిన ప్రిన్సిపల్ వల్ల మతమార్పిడుల గందరగోళం జరిగింది. ఇపుడేమో పనిచేసే సిబ్బంది కీచకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై గుంటూరులోని విద్యాశాఖ ఆర్జేడి విచారణకు ఆదేశించాలి. వాస్తవాలు నిగ్గుతేల్చి భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు రాకుండా చూడాలి.

కాకుటూరు సుజాత, కావలి

పరువు పోగొట్టుకొన్న చిరంజీవి

ప్రజారాజ్యం పార్టీని స్థాపించి అధికారంలోకి రావాలని కలలుగన్న చిరంజీవి ఈ వ్యవహారంలో విఫలమయ్యారు. ఆయన చెప్పిన సామాజిక న్యాయసూత్రాలు టిక్కెట్లు ఇచ్చేటపుడు పాటించక, వాటిని అమ్ముకోవడంతోనే ఆ పార్టీ గబ్బుపట్టి కేవలం 18 అసెంబ్లీస్థానాలకే పరిమితమయ్యింది. ఆ తర్వాత నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించలేకపోయింది. కాంగ్రెస్‌పార్టీలో చేరేందుకు వైఎస్ వున్నపుడు ఆ పార్టీ ఎమ్మెల్యేలు తపించారు. ఇపుడేమో కాంగ్రెస్‌లో తన పార్టీని విలీనం చేయను చిరంజీవి తహతహలాడుతున్నట్లు కనపడుతోంది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల అనంతరం ఆ పార్టీ ప్రభ మసకబారుతుంది. రాజకీయాల్లోకి వచ్చి హుందాగా కాకుండా చౌకబారుగా వ్యవహరించి చిరంజీవి పరువు పోగొట్టుకున్నాడు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు

కార్పొరేషన్ సమావేశంలో ఆల్‌పాస్ వైఖరి

అజెండా ఏకపక్షంగా ఆమోదించడం అన్యాయం!



సమావేశంలో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్లు రూప్‌కుమార్, వెంకటేశ్వర్లు, వెంకయ్య, మదన్‌మోహన్ రెడ్డి.

7వతేది జరిగిన నెల్లూరు కార్పొరేషన్ సమావేశంలో చర్చలేకుండానే అజెండా ఆమోదం జరిగిపోయింది. మేయర్ భానుశ్రీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో గత సమావేశాల మాదిరిగా కాకుండా ప్రజా సమస్యలపై చర్చిస్తేనే సమావేశంలో వుంటామని లేకుంటే వెళ్లిపోతామని టిడిపి పక్షనాయకుడు ధర్మవరం సుబ్బారావు చెప్పిన ఐదునిమిషాలకే అజెండాను ఆమోదిస్తున్నట్లు ప్రకటించి మేయర్ వెళ్లిపోవడంతో టిడిపి, సిపిఎం కార్పొరేటర్లు అవాక్కయ్యారు.

సమావేశం ప్రారంభానికి ముందు కార్పొరేటర్లు తాటి వెంకటేశ్వర్లు, స్వర్ణావెంకయ్య, రూప్‌కుమార్‌యాదవ్‌లు రాజరాజేశ్వరిగుడి సమీపంలో ఏర్పాటు చేసిన సితార బార్ నుంచి నగర ప్రజల్ని కాపాడాలని టీ-షర్టులు ధరించి వినూత్న నిరసన తెలిపారు. దీంతోపాటు 32వ డివిజన్‌లో ఇటీవల ప్రోటోకాల్ వుల్లంఘన జరిగిందని దీనికి సమాధానం చెప్పాలని మేయర్‌తో వాగ్వివాదానికి దిగారు. దీంతో కార్యసేవు సమావేశ మందిరంలో ఏం జరుగుతుంతో అర్థంకాని పరిస్థితి నెలకొంది. మరోప్రక్క కాంగ్రెస్ కార్పొరేటర్లు అజెండాలోని అంశాలను ఆమోదిస్తున్నట్లు ప్రకటించి బయటకు వెళ్లిపోయారు.

అజెండాలోని అంశాలపై చర్చలేకుండా ఆమోదించడం పట్ల మిగిలిన కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశాల మాదిరిగా కాకుండా ఈదఫా చర్చిస్తామని చెప్పిన మేయర్ అందుకు భిన్నంగా వ్యవహరించారు. కార్పొరేషన్ సమావేశం అంటేనే నగర ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమావేశం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఒకరిపై మరొకరు తీవ్ర స్థాయిలో ఆరోపణలు, విమర్శలు గుప్పించుకున్నారు. ప్రోటోకాల్ వుల్లంఘన గురించి అడిగితే సమాధానం చెప్పకుండా సమావేశం నుంది మేయర్ వెళ్లిపోవడం, వెంటనే కమిషనర్ కూడా కారెక్కి వెళ్లిపోవడం వంటి నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించి వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలు చేసుకునేందుకు అధికసమయం కేటాయిస్తున్న సభ్యులు ఈ నేపథ్యంలో వారు వెల్లడించిన అభిప్రాయాలను దిగువనిస్తున్నాం.

మేయర్‌ది ఏకపక్ష నిర్ణయం



నగర మేయర్ భానుశ్రీ మునిసిపల్ కౌన్సిల్ సమావేశాలలో ఏకపక్ష నిర్ణయం తీసుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ప్రజాసమస్యలపై ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదించడం దీనికి నిదర్శనమని చెప్పొచ్చు. ప్రతి సమావేశం కూడా సజావుగా సాగకుండా అధికారపక్షానికి చెందిన సభ్యులు అడ్డు తగిలి అజెండాను ఆమోదిస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోతున్నారు. ఏకపక్ష నిర్ణయాలు మానుకొని ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి.

- మాదాల వెంకటేశ్వర్లు, *డిప్యూటీ మేయర్.*

సభ్యులను అవమానిస్తున్నారు



కార్పొరేషన్ సమావేశాలకు హాజరవుతున్న సభ్యులను మేయర్ అవమానిస్తున్నారు. అజెండాలోని అంశాలను చర్చించకుండా మేయర్ ఎలా ఆమోదిస్తారు? సమావేశం ప్రారంభించి ఐదు నిమిషాలకే అజెండాను ఆమోదిస్తున్నట్లు ప్రకటించడంపై మా పార్టీ తరుపున తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తున్నాం. వ్యక్తిగత విమర్శలు, అభిప్రాయాబేధాలు ఏమైనవుంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. ఇందుకు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాన్ని వేదికగా చేసుకోవడం బాధాకరం.

- టి.అనూరాధ, *టిడిపి కార్పొరేటర్.*

మేయర్ అవినీతిపరురాలు



నగర మేయర్ భానుశ్రీ అవినీతి సంపాదనలో మునిగితేలుతుంది. పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేయకుండా విక్రయించి కోట్ల రూపాయలు సంపాదించింది. అంతేకాకుండా హోమ్‌గార్డులు, అంగన్‌వాడీవర్కర్ల ఉద్యోగాల నియామకంలో కూడా అవినీతికి పాల్పడింది. ఎమ్మెల్యే, మంత్రి అండతో ఏపనైనా చేయవచ్చునని భావిస్తుంది. మోపెడ్ వాహనంపై తిరిగే మేయర్ ప్రస్తుతం లక్షలు విలువ చేసే స్కార్పియో వాహనంలో ఎలా తిరుగుతుంది. ఇన్ని కోట్లరూపాయలు ఎలా సంపాదించిందో చెప్పాలి.

- రూప్‌కుమార్ యాదవ్, *కార్పొరేటర్.*

వర్షానికి అల్లాడిన నెల్లూరీయులు!



నగర శివారు ప్రాంతాల్లో ఇళ్లలోకి ప్రవేశించిన నీళ్లు.

చినుకు రాలితే చాలు సింహపురి నగరం సుందరముదనష్టంగా తయారవుతుంది. కొద్దిపాటి వర్షానికే ట్రంకురోడ్డుతోపాటు ప్రధాన రోడ్లన్నీ జలమయమవుతాయి. వర్షపునీటికితోడు డ్రైనేజి పొంగిపొర్లడంతో రోడ్లన్నీ మురుగునీటితో నిండిపోతున్నాయి. కాల్వల్లో సక్రమంగా పూడికతీయక దాహం వేసినపుడు బావి తవ్వుకొన్న చందంగా నీళ్లు నిలబడి రాకపోకలకు అవాంతరం ఏర్పడినపుడు చర్యలకు ఉపక్రమిస్తుండడంతో నగరవాసులు అష్టకష్టాలు పడాల్సివస్తోంది. ఇక శివారు ప్రాంతాల గురించి చెప్పనక్కరలేదు. కొద్దిపాటి వర్షానికే మోకాళ్లలోతున నీళ్లు చేరడం, ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. వెంకటేశ్వరపురం, జనార్ధన్‌రెడ్డి కాలనీ, జనశక్తినగర్, డ్రైవర్స్‌కాలనీ, మన్సూర్‌నగర్, ఖుద్దూస్‌నగర్ తదితర ప్రాంతాలన్నీ నీటితో నిండిపోయాయి. ఇళ్ల చుట్టు నీరుచేరి చెరువులను తలపిస్తుండడంతో వర్షం వస్తుందంటేనే ప్రజలు హడలిపోవాల్సి వస్తున్నది. నిన్నమొన్నటి వరకు మంచినీటి కోసం వెంపర్లాడిన ప్రజలు ఇక చాలురా భగవంతుడా అనుకొనేంతగా నగరం మురుగునీటితో నిండిపోయింది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సమస్యను చూస్తున్నా వాటి పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకోవడంలో పాలకులు మీనమేషాలు లెక్కిస్తుండడంతో రోడ్లు ధ్వంసమై, వీధులన్నీ నీటితో నిండి, ఇళ్లలోనికి నీరుచేరి నానా అవస్థలు పడుతున్నారు నగర ప్రజలు. దీనిపై వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలు ఈ విధంగా వున్నాయి.

ఇబ్బంది పడుతున్నాం



కొద్దిపాటి వర్షానికే ఇళ్లలోనికి వర్షపు నీరు వచ్చి చేరుతుండడంతో చాలా ఇబ్బందిగా వుంది. కాలు క్రింద పెట్టే అవకాశం లేకపోవడంతో మా అవస్థలు అన్ని ఇన్ని కావు. ప్రతి ఏడాది ఈ సమస్య ఎదుర్కొంటూనే వున్నాం. వర్షపునీరు ఇళ్లలోకి రాకుండా వుండేలా చర్యలు తీసుకోవాలి.

- మల్లీశ్వరి

చిందరవందరగా వుంది



వర్షం వచ్చినపుడు నగరాన్ని చూస్తే తెలుస్తుంది ఎంత ముదనష్టంగా వుందో. ఎక్కడ చూసినా కాల్వలు నిండిపోయి నీరు పారే అవకాశం లేకపోవడంతో నీళ్లు రోడ్లపై చేరి చిన్నపాటి చెరువులై వున్నాయి. ఎక్కడికక్కడ నీరు కాల్వల గుండా బయటకు వెళ్లేలా చూడాల్సి వుంది.

- కోటేశ్వరరావు

రోడ్లు అధ్వాన్నం!



నగరంలో వర్షం కారణంగా రోడ్లన్నీ దెబ్బతిని వున్నాయి. అసలే అంతంతమాత్రంగా వున్న రోడ్లు వర్షం వలన ధ్వంసం అయిపోవడంతో ప్రయాణించాలంటేనే కష్టంగా వుంది. ప్రధాన రోడ్ల పరిస్థితి ఇట్లుంటే ఇక శివారు ప్రాంతాల్లోని రోడ్లు మరింత అధ్వాన్నంగా వున్నాయి. కాల్వలు లేకపోవడంతో నీరుపోయే అవకాశంలేక ఇళ్లలోనికి వస్తున్నాయి.

- వై.రాజు

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

● రియల్ ఎస్టేట మోసగాడు

మన మంత్రికి ఆప్తుడు!

మద్రాసు నగరంలోని అడయార్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు ఇళ్ల స్థలాలిప్పిస్తానంటూ కోట్లు కొల్లగొట్టిన ఆత్మకూరువాసి ఇందూరు నారసింహారెడ్డి పురపాలక మంత్రి రామనారాయణరెడ్డికి జిగర్ దోస్త్. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రామనారాయణ ఎన్నిక భారం మొత్తం మోసింది ఆయనే.




ఆత్మకూరు పంట వీధికి చెందిన ఇందూరు నారసింహారెడ్డి అనే యువకుడిని మద్రాసు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. అందుకు కారణం, మద్రాసు నగరంలో అడయార్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులను ఇళ్ల స్థలాల పేరుతో మోసం చేయడం. మామూలు పరిస్థితులలో అయితే ఇది పెద్ద వార్త కాదు. రియల్ ఎస్టేట్ రంగంలో చాలా మంది ఇటువంటి మోసాలకు పాల్పడుతూ వుంటారు. అరెస్టు కూడా అవుతుంటారు. కానీ ఈ నారసింహారెడ్డి, జిల్లామంత్రి ఆనం రామనారాయణరెడ్డి గారికి ముఖ్య అనుచరుడు. మొన్నటి శాసనసభ ఎన్నికలలో ఎన్నికల భారం మొత్తం మోసింది ఆయనే. రామనారాయణరెడ్డి ఎప్పుడు మద్రాసుకు వెళ్లినా నారసింహారెడ్డి ఇంట్లోనే బస చేస్తుంటారు. ఆ యువకుడు పక్కన లేకుండా ఆత్మకూరు పర్యటనకు రావడం లేదు ఇటీవల కొంతకాలంగా. నియోజక వర్గంలో తరాల తరబడి ఆనం వారిని నమ్ముకొని వున్న కాంగ్రెస్‌వాదులను కూడా పక్కనపెట్టి నారసింహారెడ్డికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అందువల్లనే ఈ వార్త జిల్లాలో సంచలనం సృష్టిస్తున్నది. చర్చకు దారి తీస్తున్నది.

ఇప్పటివరకు ఆత్మకూరువాసులకు తెలిసిన విషయం – నారసింహారెడ్డి బంగారు పిచ్చుక అని మాత్రమే. ఎన్నికల సమయంలో అందుకు తగినట్లే డబ్బు వెదజల్లాడట. కానీ అసలు నిజం – ఆయన పెద్ద దగాకోరు. అడయార్ కోఆపరేటివ్ అనే సంస్థ సభ్యులకు ఇళ్లస్థలాలు ఇస్తానని 16కోట్ల రూపాయలు వసూలు చేశాడట. 150 మంది సభ్యులు, ఒక్కొక్కరు రెండు నుంచి 20 లక్షల వరకు వారి స్థోమతను బట్టి డబ్బు చెల్లించారు. చెంగల్‌పేట్ నగరానికి దగ్గరగా, చెయ్యూరు అనే గ్రామంలో వీరందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తున్నట్లు చెప్పాడట. ఆయన మాటలు నమ్మి డబ్బు చెల్లించిన వారందరూ రెండేళ్లుగా ఇళ్ల స్థలాల కోసం తిరుగుతున్నారు. కానీ నారసింహారెడ్డి దగ్గర స్థలం అంటూ వుంటే కదా ఇవ్వడానికి.

దీనితో విసిగిపోయిన ఆ సహకార సంఘం సభ్యులు పోలీసుకు ఫిర్యాదు చేస్తే, చర్య లేదట. తాను ఆంధ్రమంత్రికి సోదరుడనని పోలీసును దబాయించాడట నారసింహారెడ్డి. ఇక లాభం లేదని ఆ సభ్యులు కరుణానిధి క్యాబినెట్‌లోని ఒక కీలక నాయకుడితో మొర పెట్టుకొన్నారు. ఆయన పోలీసుకు గట్టి ఆదేశాలు జారీ చేయడంతో స్పెషల్ బ్రాంచ్ విభాగం రంగంలోకి దిగింది. నారసింహారెడ్డితో పాటు, ఆ సొసైటీ పెద్దరికం చేస్తుండిన సదాశివం అనే రిటైర్డ్ కోఆపరేటివ్ అధికారిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

ఈ అరెస్టు, కందిరీగల తుట్టెను కదిలించినట్లు అయ్యింది. ఈ వార్తను పత్రికలలో చదివిన మద్రాసు నగరవాసులు చాలా మంది తాము కూడా ఆయన చేతిలో మోసపోయామని పోలీసు వద్దకు పరుగెత్తుకొని వెళ్తున్నారు. ఈ బాధితుల సంఖ్య ఆరేడు వందల వరకు వుందట. దాదాపు వందకోట్ల రూపాయల వరకు నారసింహారెడ్డి రియల్ ఎస్టేట్ పేరుతో జనాన్ని వంచించాడని పోలీసుకు ఫిర్యాదులు అందుతున్నాయని తెలుస్తున్నది. వాటిలో నిజం ఎంతో అబద్ధం ఎంతో విచారణలో కానీ బయటపడదు.

నాలుగు కాసులు గలగల లాడుతున్నట్లు కన్పిస్తే చాలు, వెనుకా ముందు చూడకుండా దగ్గరకు తీయడం రాజకీయవాదులకు ఫ్యాషన్ అయిపోయింది. ఈ నాయకులను అడ్డం పెట్టుకొని నారసింహారెడ్డి వంటి దగాకోరులు జనం నెత్తిన చెయ్యిపెట్టడమూ సాంప్రదాయంగా మారింది.




వీజెపి నేత, రాష్ట్ర రొయ్యల రైతు సంఘం నాయకుడు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి కుమార్తె శ్వేత మీనాక్షి, సిద్ధార్థరెడ్డిల వివాహం అక్టోబర్ 28తేదీ చెముడుగుంటలోని దుర్గ ఫంక్షన్ హాల్‌లో జరిగింది.

ఆనం సోదరుల పట్ల సోమిరెడ్డి ఔదార్యం!



ప్రత్యర్థులు చిన్న తప్పు చేసినా పెద్దనోరు చేసుకొని విమర్శల జడివాన కురిపించడం జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి సరదా. దానివల్ల ఆయన అకారణ విరోధాలను నెత్తికి తెచ్చుకొంటూ వుంటాడు. కానీ ఇటీవల కొంతకాలంగా ఆనం సోదరుల పట్ల మాత్రం చాలా ఔదార్యంతో వ్యవహరిస్తున్నాడు చంద్రమోహన్‌రెడ్డి. ఇసుక కుంభకోణం నుంచి నెల్లూరు నగరంలో భానుశ్రీ అరాచకాల వరకు, రాజరాజేశ్వరి దేవాలయం పక్కన బారు నడిపే అప్రాచ్యపు పని నుంచి, రామనారాయణరెడ్డి ముఖ్య అనుచరుడు మోసం కేసులో పోలీసులకు పట్టుబడడం వరకు ఎంత పెద్ద వివాదం వెలుగులోకి వచ్చినా వులుకుపలుకు చూపడం లేదు. ఆనం సోదరులు చంద్రమోహన్‌రెడ్డి పట్ల ఎప్పుడూ ఇటువంటి ఉదారత చూపలేదు. నకిలీ ఎరువుల నుంచి పనికి ఆహారం బియ్యం వరకు ఏ చిన్న అవకాశం దొరికినా ఆయన్ను కడిగి ఆరపోసే వారు. ఇప్పుడు మాత్రం వీరిద్దరి మధ్య బయటకు తెలియని అవగాహన ఏదో కుదిరినట్లు కన్పడుతున్నది. ప్రతిపక్షాలు అధికారపక్ష నేతలతో అవగాహన కుదుర్చుకోవడంతో, రాజీవ్‌భవన్ కాంగ్రెస్‌వాదులే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారు. ఆ బరువు తమ భుజాల మీద మోస్తున్నారు. లేకుంటే ఇసుక కుంభకోణం, బియ్యం స్మగ్లింగ్ వంటి దారుణమైన దోపిడీలు వెలుగులోకి రాకుండా సమాధి అయిపోయి వుండేవి.

కార్టూన్ స్కేప్



తగ్గింది... ఆత్మహత్యలు కాదు సార్, రైతులు...!

టీవీ ఛానళ్లలో పాగా



తెలుగులోని రెండు ప్రధాన టీవీ న్యూస్ ఛానళ్లలో వైఎస్ జగన్ భాగస్వామ్య వాటా కొనుగోలు చేసినట్లు తెలుస్తున్నది. ఎన్టీవిలో దాదాపు 50 శాతం వాటా తన సన్నిహితుల పేరుతో కొన్నాడట. ఇప్పటికే అందులో కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్ ఆలీకి ప్రమేయం వుంది. టీవీ5 ఛానళ్లలో తనకు అత్యంత ఆప్తుడు, జలయజ్ఞం కాంట్రాక్టర్ల నుంచి లెక్క ప్రకారం ముడుపులు దండిపెట్టే అనుచరుడైన మెగా కృష్ణారెడ్డి పేరిట 26శాతం వాటా కొనుగోలు చేశాడని తెలుస్తున్నది. ఏ పరిస్థితులలో అయినా కాంగ్రెస్ నుంచి బయటపడి స్వంతపార్టీ పెట్టుకోవలసి వస్తే, జనంలో ప్రచారానికి టీవీ ఛానళ్ల అవసరం ఎంతగానో వుంటుంది. సాక్షి తన స్వంత టీవి అని ప్రజలకు తెలుసు కాబట్టి, అందులో ఇచ్చే ప్రచారం పెద్దగా ప్రయోజనం కల్గించక పోవచ్చు. అందువల్ల వీలైనన్ని ఎక్కువ న్యూస్ టీవీ ఛానళ్లను తన అదుపులోకి తీసుకోవాలని భావిస్తున్నాడు జగన్. అందులో భాగమే ఈ రెండు టీవీ ఛానళ్లలో వాటా కొనుగోలు.

తెలుగు న్యూస్ ఛానళ్లలో టీవీ9, ఈటీవీ తప్ప తతిమావన్నీ నష్టాలలో నడుస్తున్నాయి. కొన్ని మూతపడే స్థితికి చేరుకొంటున్నాయి. అటువంటి వారికి జగన్ దేముడి వలె కన్పిస్తున్నాడు. ఆయన అడగగానే కోరినంత వాటా అప్పచెప్పి దండం పెడుతున్నారు.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.